# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 364, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) మంగళవారం - 18 - మార్చి - 2025


## వందే భారత్ స్పీడ్ వేగం ఎందుకు తగ్గుతోంది..

### రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఏమన్నారంటే..?




**న్యూఢిల్లీ,:** భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను తీసుకువచ్చింది. అత్యాధునిక సౌకర్యాలతో పాటు హైస్పీడ్ రైళ్లను పెద్ద ఎత్తున తీసుకువస్తున్నది. అయితే, ప్రస్తుతం ఈ రైళ్ల వేగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సెమీహైస్పీడ్ రైళ్లను గతంలో ప్రకటించిన వేగంతో నడపడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వందే భారత్ రైళ్ల వేగంపై వస్తున్న ప్రశ్నలకు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇచ్చారు.

## నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది




**న్యూఢిల్లీ,:** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడ్డారు. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ముడి చమురు ధరలు 42 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. ఈ మేరకు పలు మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికలను ఆయన ఉటంకించారు.

## విద్యార్థి ఆత్మహత్యాయత్నాన్ని ప్రభుత్వం తొక్కిపెట్టింది..

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆరోపణ




ఆ అవసరమే తమకు లేదన్న మంత్రి సీతక్క

వ్యక్తిగత కారణాలవల్లే ఆత్మహత్యాయత్నం చేశాడని వివరణ

అసెంబ్లీలో మంత్రి సీతక్క వర్సెస్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి

## తెలంగాణ ప్రజా ప్రతినిధులకు

# టీటీడీ శుభవార్త




- ఇకపై తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు కూడా శ్రీవారి దర్శనం
- మార్చి 24 నుంచి తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు
- సోమ, మంగళవారాల్లో తెలంగాణ సిఫార్సు లేఖపై వీఐపీ బ్రేక్ దర్శనం
- బుధ, గురువారాల్లో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అవకాశం

# త్రిభాషా విధానంలో తప్పేముంది...

- వివాదాస్పదంగా మారిన త్రిభాషా విధానం
- ఏపీ అసెంబ్లీలో చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు
- త్రిభాషా విధానాన్ని సమర్థించిన వైనం
- ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఉపయోగం అని వెల్లడి
- అందులో ఒక శాతం నా భాగస్వామ్యం ఉన్నందుకు గర్విస్తున్నా: సీఎం చంద్రబాబు
- కొనసాగుతున్న ఏపీ అసెంబ్లీ సమావేశాలు
- సభలో స్వర్ణాంధ్ర విజన్ పై లఘు చర్చ
- 10 సూత్రాల ఆధారంగా విజన్ అమలు చేస్తున్నామన్న చంద్రబాబు


వివరాలు 2లో..




మీడియంతో నాలెడ్జ్ వస్తుందని చెబుతున్నారు. కానీ, మాతృభాషలో చదువుకున్న వారే ప్రపంచ వ్యాప్తంగా రాణించారు. భాష ఏదైనా సరే, దాన్ని ద్వేషించడంలో అర్థం లేదు. మన విషయానికొస్తే...

**అమరావతి,:** అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన లఘు చర్చలో 'స్వర్ణాంధ్ర విజన్-2047'లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల-2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించి, ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు, వివాదాస్పదంగా మారిన త్రిభాషా విధానం అంశంపై తమ వైఖరి వెల్లడించారు. త్రిభాషా విధానంలో తప్పేమీ లేదని అన్నారు. భాష అనేది కేవలం కమ్యూనికేషన్ కు మాత్రమేనని, భాష అనేది భావవ్యక్తీకరణ సాధనం అని వివరించారు. "ఇంగ్లీష్ మన మాతృభాష తెలుగు, మనకు హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్. మన వాళ్లు జపాన్, జర్మనీ, ఇతర దేశాలకు వెళుతున్నారు. అవసరమైతే ఆ భాషలను మనం నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు ఇంకా పెరుగుతాయి. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఎక్కువ ఉపయోగం ఉంటుంది" అని చంద్రబాబు వివరించారు. కాగా, త్రిభాషా విధానాన్ని తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## బెంగాల్‌లో హోలీ నాడు ఘర్షణపై..

# మమతా బెనర్జీపై ఆదిత్యనాథ్ మండిపాటు




లక్నో: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై మండిపడ్డారు. మహా కుంభ్‌ను 'మృత్యు వేడుక'గా పిలిచే వారు హోలీ రోజున తమ సొంత రాష్ట్రంలో చెలరేగిన మత ఘర్షణలను నివారించలేకపోయారని ఎద్దేవా చేశారు. జనవరి 29న ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో 30 మందికిపైగా మరణించడంపై మమతా బెనర్జీ పలు ఆరోపణలు చేశారు. అయితే మార్చి 14న హోలీ రోజున బెంగాల్‌లోని బిర్భూమ్ జిల్లాలో హింస జరిగింది. కాగా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ దీనిపై సోమవారం స్పందించారు. సీఎం మమతా బెనర్జీపై మండిపడ్డారు. '66 కోట్లకు పైగా భక్తులు పాల్గొన్న

## వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతున్నారు




సభా సమావేశాల నుంచి వైసీపీ సభ్యుల వాకౌట్

బయట ఉన్న వైసీపీ సభ్యులను మార్షల్స్ సాయంతో లోపలికి తీసుకురావాలన్న లోకేశ్

చైర్మన్ కు ఆ అధికారం ఉందని వెల్లడి

**అమరావతి,:** వైసీపీ హయాంలో టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు ప్రయత్నించారని మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. ఇప్పుడు ఆ అంశంపై సభలో చర్చలో పాల్గొనకుండా, వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి

## ఏపీకి యూనివర్సిటీలు రాకుండా

# గత ప్రభుత్వం అడ్డుకుంది..

- యూనివర్సిటీల చట్టానికి వైసీపీ ప్రభుత్వం ఐదుసార్లు సవరణ చేసిందని ఆరోపణ
- బ్రౌన్ ఫీల్డ్ యూని వర్సిటీలకు ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శ
- వైసీపీ సవరణలతో ఈ చట్టం యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా మారిందని వెల్లడి

### మండలిలో మంత్రి లోకేశ్


వివరాలు 2లో..




**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ లో ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటును తమ ప్రభుత్వం స్వాగతిస్తోందని మంత్రి నారా లోకేశ్ మండలిలో పేర్కొన్నారు. బడ్జెట్ సెషన్ లో భాగంగా సోమవారం మండలిలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబిచ్చారు. తమ ప్రభుత్వం గతంలో, ప్రస్తుతం కూడా గ్రీన్ ఫీల్డ్ యూనివర్సిటీల ఏర్పాటును ప్రోత్సహిస్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా తీసుకొచ్చిన యూనివర్సిటీల చట్టం ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు అనుకూలంగా ఉందన్నారు.

## వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో

# రూ. 250 కోట్ల అవినీతి: పవన్ కల్యాణ్




- ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు
- మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందన్న పవన్
- ఆ సమయంలో మాట్లాడిన డిప్యూటీ సీఎం

**అమరావతి,:** ఏపీ ఉపాధి హామీ పథకంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అసెంబ్లీలో ఆరోపించారు. ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు

## అందుకే తెలుగు యూనివర్సిటీకి

# పొట్టి శ్రీరాములు పేరును తొలగించాం!

- పాలనాపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పేరు మార్చినట్లు వెల్లడి
- తెలంగాణ ఏర్పడిన తర్వాత చాలా యూనివర్సిటీల పేర్లు మార్చుకున్నట్లు వెల్లడి
- రోశయ్య, ఆర్యవైశ్య సమాజం పట్ల ప్రభుత్వానికి గౌరవం, నమ్మకం ఉందన్న ముఖ్యమంత్రి


వివరాలు 2లో..




హైదరాబాద్: రాష్ట్ర విభజన అనంతరం పరిపాలనా సౌలభ్యం, రెండు రాష్ట్రాల్లో సంస్థలకు ఒకే పేరు కారణంగా ఎదురవుతున్న గందరగోళానికి తెరదించాలన్న ఉద్దేశంతో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప రెడ్డి పేరును పెడుతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత పదేళ్లుగా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, విధివిధానాలు పరిశీలించిన తర్వాత తెలుగు విశ్వవిద్యాలయ పేరు మార్పును ప్రతిపాదించామని చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీ సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్పు చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుపై శాసనసభలో ముఖ్యమంత్రి స్పందించారు. పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మ గాంధీ గారి స్ఫూర్తితో పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాల ద్వారానే మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిందని గుర్తుచేశారు. పొట్టి శ్రీరాములు పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. వారి దేశభక్తి, ప్రాణత్యాగం

## మాకు చాలా విషయాలు తెలుసు...

## వాస్తవాలు చెబితే రేవంత్ రెడ్డికి ఇబ్బందులు తప్పవు




బీజేపీ నేతలతో రహస్య సమావేశాలను ఎందుకు ఖండించడం లేదని ప్రశ్న

రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

రేవంత్ రెడ్డి బడ్జెట్ కంటే ముందే నేరాన్ని అంగీకరించి అప్రూవర్‌గా మారాడని వ్యాఖ్య

## బీజేపీ ఎంపీ డీకే అరుణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్




- ఎంపీ ఇంట్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తి
- కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- ఆగంతుకుడిని గుర్తించేందుకు సీసీ ఫుటేజీ పరిశీలన

**హైదరాబాద్, :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ నేత

# తెలంగాణ ప్రజా ప్రతినిధులకు టీటీడీ శుభవార్త

తెలంగాణ: తెలంగాణ ప్రజాప్రతి నిధులకు టీటీడీ శుభవార్త చెప్పింది. ఇకపై తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు కూడా శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. మార్చి 24వ తేదీ నుంచి తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు ఉంటాయని టీటీడీ వెల్లడించింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రజాప్రతినిధులను అప్పటి టీటీడీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక చొరవతో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరించే విధానం అమలు కానుంది. సోమ, మంగళవారాల్లో తెలంగాణ సిఫార్సు లేఖపై వీఐపీ బ్రేక్ దర్శనం కేటాయింపు ఉంటుంది. అలాగే బుధ, గురువారాల్లో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అవకాశం ఉంటుంది. ఒక ప్రజాప్రతినిధి తాలూకు ఒక సిఫార్సు లేఖపై ఆరుగురికి మించకుండా దర్శన అవకాశం కేటాయించనుంది. ఏపీ ప్రజా ప్రతినిధులకు ఇకపై సోమవారం దర్శనానికి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. దానికి బదులుగా ఆదివారం దర్శనం కోసం శనివారం నాడు టీటీడీ లేఖలు స్వీకరించనుంది. సుదీర్ఘంగా చర్చించి, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ వెల్లడించింది. ఈ మార్పులను దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి సహకరించాలని భక్తులను టీటీడీ కోరింది.

# మోడీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది

మొదటి పేజి తరువాయి

బీజేపీ ప్రభుత్వం ఇంకెన్నాళ్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతూ వారిని దోచుకుంటుందని మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ముడి చమురు ధరలు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం తగ్గట్లేదని విమర్శించారు. మే 2014 నుంచి సుమారు 34 శాతం వరకు ముడి చమురు ధరలు తగ్గాయని చెప్పారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ.36 లక్షల కోట్ల పన్ను వసూలు చేసిందని ఆరోపించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకా ఈ దోపిడీ ఎంతకాలం కొనసాగుతుందని ఖర్గే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో అమల్లోకి తేనున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మాట్లాడుతూ.. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని అన్నారు. దేశ వనరులు, పాలనలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం ఉండాలన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడంవల్ల దక్షిణాదిలో ఎంపీ సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉందని, ఉత్తరాదిలో ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. దాంతో దేశంలో సమన్యాయం లేకుండా పోతుందని వ్యాఖ్యానించారు. అలాంటివి జరగకుండా సామాజిక సమానత్వం కోసం అందరు కలిసికట్టుగా పోరాడాలని మల్లికార్జున్ ఖర్గే పిలుపునిచ్చారు.

# ఆ విషయం తెలిసి రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు

మొదటి పేజి తరువాయి

ఆగంతుకుడు తమ ఇంట్లో ఏమీ ముట్టుకోకుండానే వెళ్లిపోయాడని చెప్పారు. రాజకీయంగా తనపై కక్ష కట్టి ఎవరైనా పంపించారో తెలియదని ఆమె అన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని వెల్లడించారు. దర్యాప్తు పూర్తయితే గానీ ఏం జరిగిందో స్పష్టత వస్తుందని తెలిపారు. తనకు భద్రత పెంచమని ముఖ్యమంత్రిని కోరానని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. తెల్లవారుజామును గం.3.28 నిమిషాలకు ఇంటి వెనుక గోడ దూకి లోనికి వచ్చాడని, కిటికీని తెరిచి లోపలకు వచ్చాడని చెప్పారు. లోనికి వచ్చాక కెమెరాలను ఆపివేశాడని ఆమె వెల్లడించారు. దాదాపు గంటన్నర పాటు ఇంట్లోనే ఉన్నాడని చెప్పారు. కొన్ని కెమెరాలను ఆపివేసినప్పటికీ, మరికొన్ని కెమెరాలు ఆన్‌లోనే ఉన్నాయని చెప్పారు. సాధారణంగా దొంగతనానికి వచ్చిన వ్యక్తి ఏదైనా తీసుకుపోతాడని, కానీ ఆగంతుకుడు ఏమీ తీసుకుపోలేదని తెలిపారు. కాబట్టి ఆ వ్యక్తి ఎందుకు వచ్చాడో విచారణలో తేలుతుందని అన్నారు.

# వందే భారత్ స్పీడ్ వేగం ఎందుకు తగ్గుతోంది..

మొదటి పేజి తరువాయి

రైలు వేగం తగ్గడానికి గల కారణాలను వెల్లడించారు. పార్లమెంట్‌లో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. హైస్పీడ్ రైలు సగటు వేగం ఎందుకు తక్కువగా ఉందని.. ప్రభుత్వ ప్రణాళిక.. రైలు వేగంతో నడిపేందుకు ఏం చర్యలు తీసుకున్నారు.. పూర్తిస్థాయి వేగంతో నడిపేందుకు ఎంత సమయం పడుతుందని పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రైలు వేగం ఇంజిన్‌పై మాత్రమే ఆధారపడి ఉండదని రైల్వే మంత్రి పేర్కొన్నారు. రైలు నడిచే ట్రాక్‌పై సైతం ఆధారపడి ఉంటుందని.. రైల్వేలైన్లను మెరుగుపరిచే పని నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. 2014 సంవత్సరంలో రైళ్లు గంటకు 110 కిలోమీటర్లు.. అంతకంటే ఎక్కువ వేగంతో 31వేలకుపైగా కిలో మీటర్ల ట్రాక్‌లో మాత్రమే నడవగలమని చెప్పారు. ప్రస్తుతం 80వేల కిలోమీటర్లకు పెంచామన్నారు. ప్రస్తుతం అంత పరిధిలో మాత్రమే పూర్తిస్థాయి వేగంతో నడవగలవన్నారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గరిష్ఠంగా 160 కిలోమీటర్ల వేగంతో నడిచే సామర్థ్యం ఉంది. కొంతకాలం కిందట ట్రయల్స్‌లో భాగంగా రైలును దాదాపు 180 కిలోమీటర్ల వేగంతోనూ దూసుకెళ్లింది. అయితే, ఇటీవల హైస్పీడ్ రైళ్ల వేగంగాపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 136 వందే భారత్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. భారత్‌లో అత్యధిక వేగంతో నడిచే రైళ్లలో వందే భారత్ ఒకటి. వందే భారత్ రైళ్లకు ప్రస్తుతం ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. కొన్ని చోట్ల మినహా మిగతా అన్ని రైళ్లలో ఆక్యుపెన్సీ భారీగానే ఉన్నది.

## విద్యార్థి ఆత్మహత్యాయత్నాన్ని ప్రభుత్వం తొక్కిపెట్టింది..

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆరోపణ

**హైదరాబాద్, :** బీసీ సంక్షేమ వసతి గృహాలలో వసతులు సరిగా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల తన నియోజకవర్గంలోని బీసీ హాస్టల్ లో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడని తెలిపారు. ఆ విద్యార్థి రెండు రోజులుగా కోమాలో ఉన్నాడని వివరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ విషయాన్ని బయటకు రానీయకుండా తొక్కిపెట్టిందని ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. అయితే, ఈ ఆరోపణలను మంత్రి సీతక్క ఖండించారు. ఏ విషయాన్నీ తొక్కిపెట్టాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదన్నారు. సదరు విద్యార్థి వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్యాయత్నం చేశాడని, మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని వివరించారు. నీలోఫర్ లో చేర్పించి విద్యార్థికి చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో రాజకీయం చేయొద్దంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మంత్రి సీతక్క హితవు పలికారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చెబుతున్నట్లు కేసీఆర్ పాలనలో హాస్టళ్ల నిర్వహణ బాగుండేదనే మాటే నిజమైతే.. కేసీఆర్ పదేళ్ల పాలనలో మొత్తం 114 మంది గురుకుల విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో చెప్పాలని మంత్రి సీతక్క నిలదీశారు. దుబ్బాక హాస్టల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం ఘటనకు సంబంధించి నివేదిక తెప్పించుకుని సమగ్ర విచారణ జరిపిస్తామని మంత్రి అసెంబ్లీలో ప్రకటించారు.

# వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతున్నారు

మొదటి పేజి తరువాయి

పారిపోతున్నారని ధ్వజమెత్తారు. శాసనమండలిలో 2019-24 మధ్య అవినీతి, అక్రమాలపై చర్చను నిరసిస్తూ వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందించారు. "సభా సమావేశాల అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది. అందరూ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. 2019-24 మధ్య జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాల అంశంపై చర్చకు అనుమతిస్తూ మండలి ఛైర్మన్ ఆదేశాలు జారీచేశారు. బీఏసీలో వైసీపీ సభ్యులు అంగీకరించారు. చర్చలో వైసీపీ సభ్యులు 2014-19 మధ్య జరిగిన పాలనపై ఆరోపణలు చేసి.. ఇప్పుడు సమాధానం ఇస్తుండగా వాకౌట్ చేస్తున్నారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతారు. సమాధానానికి సమయం ఇవ్వరు. మేం సమాధానం ఇచ్చే సమయంలో సభలో ఉండరు. ఇది మొదటిసారి కాదు... పదేపదే ఈ విధంగా చేస్తున్నారు. గతంలో మార్షల్స్ ను పెట్టి సభను నడిపించిన పరిస్థితి చూశాం. ఇప్పుడు మార్షల్స్ ను పెట్టి బయట ఉన్న సభ్యులను సభకు తీసుకురావాలని ఛైర్మన్ ను కోరుతున్నాం. ఆ అధికారం ఛైర్మన్ కు ఉంది. 2014-19 మధ్య పాలనపై వైసీపీ సభ్యులు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి కేసులు పెట్టారో చూశాం. చేయని తప్పునకు చంద్రబాబు గారిని 53 రోజుల పాటు జైల్లో పెట్టారు. మొదట రూ.3వేల కోట్ల కుంభకోణం అన్నారు, తర్వాత రూ.300 కోట్లని, తర్వాత రూ.27 కోట్లు అని అన్నారు. చేయని తప్పునకు జైలుకు పంపారు. అచ్చెన్నాయుడు గారిని, ధూళిపాళ్ల నరేంద్ర గారిని, కొల్లు రవీంద్ర గారిని, నారాయణ గారిని.. అందరినీ ఇబ్బంది పెట్టారు. చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. ఇవన్నీ బయటపడతాయని భయపడుతున్నారా? ఆరోపణలు చేసి పారిపోతున్నారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మా నాయకులు చేయని తప్పులకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు యత్నించారు. ఆ కేసులపై చర్చించాలి. నాపైనా 23 కేసులు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. హత్నాయత్నం కేసు పెట్టారు. చర్చకు లేకుండా పారిపోయారు. ఇది సరికాదు" అని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# బెంగాల్‌లో హోలీ నాడు ఘర్షణపై.. మమతా బెనర్జీపై ఆదిత్యనాథ్ మండిపాటు

మొదటి పేజి తరువాయి

'66 కోట్లకు పైగా భక్తులు పాల్గొన్న మహా కుంభమేళాను వారు అస్తవ్యస్తం అని పిలిచారు. 'మృత్యు కుంభ్ (మరణ పండుగ)' అని ముద్ర వేశారు. కానీ హోలీ సమయంలో వారి సొంత రాష్ట్రంలో శాంతిభద్రతలను కూడా నియంత్రించలేకపోయారు' అని విమర్శించారు. వారి రాష్ట్రంలో పండుగ జరిగినప్పుడల్లా కర్ఫ్యూ విధిస్తారని, అయితే ఉత్తరప్రదేశ్‌లో హోలీని ఆనందంగా జరుపుకుంటారని, ఆ తర్వాత 'జుమ్మా' ప్రార్థనలు చేస్తారని యోగి ఆదిత్యనాథ్ అన్నారు.

# అందుకే తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించాం!

మొదటి పేజి తరువాయి

వారి దేశభక్తి, ప్రాణత్యాగం మరువలేనిదని అన్నారు. "తెలంగాణ ఏర్పాటుకు కృషి చేసిన ప్రముఖులను మనం స్మరించుకుంటున్నాం, వారి పేర్లను మన విద్యా సంస్థలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు పెట్టుకుంటున్నాం. ఈ విషయంలో కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయడం మంచిది కాదు. రాష్ట్ర విభజన తర్వాత ఆయా భౌగోళిక ప్రాంతాల్లో ఉన్న యూనివర్సిటీలు ఆయా రాష్ట్రాల పరిధిలోకి వెళ్లగా, ఆ ప్రక్రియలో భాగంగా యూనివర్సిటీలకు కొత్త పేర్లు పెట్టుకోవడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా ఉండగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ పేరు కొనసాగిస్తున్నారు. తెలంగాణలో దానికి శ్రీ కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీగా నామకరణం చేసుకున్నాం. ఇలా మార్చడం వల్ల ఎన్టీఆర్ గారిని అగౌరవపరిచినట్టు కాదని, రెండు రాష్ట్రాల్లో ఒకే పేరుతో యూనివర్సిటీలను కొనసాగిస్తే పరిపాలనలో గందరగోళం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో హెల్త్ యూనివర్సిటీ పేరును కాళోజీ నారాయణరావు పేరును పెట్టుకున్నాం. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా నామకరణం చేసుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న వ్యవసాయ వర్సిటీ రంగా పేరుతో కొనసాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్‌లో యధాతథంగా కొనసాగుతుండగా, తెలంగాణలో హార్టికల్చర్ వర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ కొనసాగుతుండగా తెలంగాణలో వెటర్నరీ యూనివర్సిటీకి స్వర్గీయ పీవీ నరసింహారావు పేరును పెట్టుకున్నాం. ఈ కోవలోనే రాష్ట్ర విభజన తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు గారి పేరుతో కొనసాగుతుండగా, తెలంగాణలో సురవరం ప్రతాప రెడ్డి పేరును ప్రతిపాదించాం. ఈ మార్పు ఒక వ్యక్తి కోసమో, కుటుంబం కోసమో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదు. మిగతా యూనివర్సిటీలకు పేర్లను ఎలా మార్చుకున్నామో అదే తరహాలో తెలుగు విశ్వవిద్యాలయానికీ మార్పు ప్రతిపాదన చేశాం.

ఆరోజుల్లో తెలంగాణకు అసలు భాషనే లేదని అవహేళన చేసిన సందర్భంలో 354 మంది తెలంగాణ కవుల సంచికగా గ్రంథాన్ని తీసుకొచ్చారు. గోల్కొండ పత్రికను ప్రారంభించి ఆనాడు తెలంగాణ ఉద్యమాన్ని సురవరం ప్రతాప రెడ్డి ముందుండి నడిపించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీఎస్ ఆర్టీసీని టీజీఆర్టీసీగా, ఏపీఐఐసీని టీజీఐఐసీగా, ఏపీపీఎస్సీని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా మార్చుకున్నాం. తెలంగాణ ఏర్పడిన తర్వాత పరిపాలనలో భాగంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న ఉద్దేశంతో యూనివర్సిటీల పేర్లకు మార్పులు చేశాం. ఈ నిర్ణయాల్లో ఎవరినో కించ పరచాలన్న ఉద్దేశం కాదు. పరిపాలన పరంగా ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని, రాష్ట్ర విశాల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. పొట్టి శ్రీరాములు , మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ రోశయ్య గారి పట్ల, ఆర్యవైశ్య సమాజం పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, నమ్మకం, విశ్వాసం ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారితో కలిసి ఇటీవల చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఒక హబ్‌గా తీర్చిదిద్దుకున్న నేపథ్యంలో ఆ స్టేషన్‌కు పొట్టి శ్రీరాములు పేరును పెట్టి ఆ ప్రముఖుడి త్యాగాలను స్మరించుకుందాం. ఈ విషయంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి. అలాగే, ప్రముఖ నాయకులు రోశయ్య హైదరాబాద్‌లో నివాసమున్న ఇంటికి సమీపంలోని బల్కంపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయానికి రోశయ్య పేరును పెట్టాలని ప్రతిపాదిస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన సుదీర్ఘ అనుభవజ్ఞులు, ముఖ్యమంత్రిగా గవర్నర్‌గా ఎనలేని సేవలు అందించిన రోశయ్య పేరును పెట్టడం సమంజసం. రోశయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా చేస్తున్న నేపథ్యంలో ఆ చికిత్సాలయంలో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం. తద్వారా వారి సేవలను ఎల్లప్పుడూ స్మరించుకోవచ్చు. ఈ రెండు చర్యల ద్వారా ఆర్యవైశ్యుల పట్ల ఉన్న ప్రత్యేక అభిమానాన్ని నిరూపించుకుందాం..." అని ముఖ్యమంత్రి గారు చెప్పారు.

# త్రిభాషా విధానంలో తప్పేముంది..

**అందులో ఒక శాతం నా భాగస్వామ్యం ఉన్నందుకు గర్విస్తున్నా: సీఎం చంద్రబాబు**

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ పై ఏపీ అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, 10 సూత్రాలు నిర్దేశించుకుని స్వర్ణాంధ్ర విజన్ వైపు అడుగులేస్తున్నామని చెప్పారు. తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలతో దేశం అభివృద్ధి బాటలో ముందుకు పోతోందని... ఈ సంస్కరణల్లో ఒక శాతం నా భాగస్వామ్యం ఉన్నందుకు గర్విస్తున్నానని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి ప్రపంచవ్యాప్తంగా భారతీయులు నెంబర్ వన్ గా నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి వందేళ్లు పూర్తవుతాయని పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం, టెక్నాలజీ, పీ4 వంటి అంశాలను విజన్ డాక్యుమెంట్ లో పొందుపరిచామని తెలిపారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మున్సిపాలిటీ, మండలాల వారీగా విజన్ ప్రణాళిక సిద్ధమైందని అన్నారు. సచివాలయం యూనిట్ గా తీసుకుని ప్రణాళిక అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రజల సామాజిక ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనాలు రూపొందిస్తామని తెలిపారు. ప్రజలే ఆస్తిగా నియోజకవర్గాల ప్రోగ్రెసివ్ విజన్ రూపొందించామని చెప్పారు. ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. కుటుంబ జీవన ప్రమాణాలు పెరిగేలా ఆర్థిక స్వావలంబన దిశగా కృషి చేస్తున్నట్టు వివరించారు. చేపలు ఇవ్వడం కాదు... చేపలు పట్టేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యం, తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రతి కుటుంబానికి నివాస స్థలం, ఇల్లు, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని అన్నారు. సురక్షిత నీరు, గ్యాస్ కనెక్షన్ ఇలా అన్ని సౌకర్యాలు అందడమే లక్ష్యం అని వివరించారు. రానున్న రోజుల్లో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజి విద్యుదుత్పత్తి రంగాలు గేమ్ చేంజర్ లా మారతాయని స్పష్టం చేశారు. సంపద సృష్టికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పరిశ్రమలు తీసుకురావడమే బాధ్యతగా ఎమ్మెల్యేలు పనిచేయాలని చంద్రబాబు సూచించారు. గత ప్రభుత్వం తరహాలో పరిశ్రమలను తరిమేయొద్దని అన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్ లో పెట్టగలిగామని, ఇలాంటి సమయంలో దూరదృష్టితో ఆలోచించి ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. 1990లోనే సమైక్యాంధ్ర ప్రదేశ్ కోసం విజన్ 2020 తీసుకొచ్చామని, చెప్పిన దానికంటే ఎక్కువ ప్రయోజనమే ఉమ్మడి రాష్ట్రానికి కలిగిందని వెల్లడించారు. ప్రధాని మోదీ వికసిత భారత్-2047ని అమలు చేస్తున్నారని, మనం స్వర్ణాంధ్ర విజన్-2047ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేలను భాగస్వాములుగా చేస్తూ నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్లకు రూపకల్పన చేస్తున్నట్టు వివరించారు. 2047 నాటికి ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారడమే లక్ష్యమని, తలసరి ఆదాయం రూ.55 లక్షలు సాధించేలా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేశామని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధి రేటు సాధించేలా లక్ష్యం నిర్దేశించుకున్నట్టు చంద్రబాబు వెల్లడించారు. రాయలసీమ రాళ్ల సీమగా మారిపోతుందనుకున్నారని, కానీ రాయలసీమ రతనాల సీమగా మారడం ఖాయమని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో అనంతపురం ఐదోస్థానానికి వచ్చిందని వివరించారు.

# కేబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా

హైదరాబాద్,: తనకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారని.. కేబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అధికారులను తొలగించి.. బదిలీలు చేస్తేనే.. పరిపాలనపై పట్టు సాధించినట్లా అని ప్రతిపక్షాలను ఆయన నిలదీశారు. అన్నింటిని సరిదిద్దుకుంటూ వెళ్లడమే తన విధానమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వంపై అందరికీ నమ్మకం కలిగించడమే తమ లక్ష్యమని ఆయన కుండ బద్దలు కొట్టారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.6 వేల కోట్లతో ఈ పథకం చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా 5 లక్షల మంది నిరుద్యోగులకు లబ్ధి చేకూరుతోందన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు సాయంగా ఉంటుందని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 10 నెలల్లోనే 57,924 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని వివరించారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఇన్నీ ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం దేశంలోనే లేదని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డల ఆత్మగౌరవం నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు త్వరలోనే 1.20 కోట్ల చీరలు పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకే.. పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 29,550 పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం.. ఆర్టీసీకి రూ.5,500 కోట్లు చెల్లించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అదే విధంగా రైతులకు రూ.20,617 కోట్ల రుణమాఫీ చేశామని.. బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు సైతం పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణపైనా అసెంబ్లీలో బిల్లు పెట్టామన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారా చేసిందన్నారు. కానీ తాము దుబారా ఖర్చులు తగ్గిస్తూ.. అప్పులు చెల్లిస్తున్నామని చెప్పారు. నిత్యవసర ధరల నియంత్రణలో దేశంలోనే ముందున్నామని చెప్పారు. జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే తెలంగాణ ముందుందని గుర్తు చేశారు. ఇక ఇసుక విక్రయంలోనే రోజు వారీ ఆదాయం రూ. 3 కోట్లు పెరిగిందన్నారు. అబద్దాల పునాదులపై తాము ప్రభుత్వాన్ని నడపట్లేదన్నారు. దేశంలోనే ఇప్పటి వరకు ఎక్కడా కులగణన జరగలేదని గుర్తు చేశారు. దేశమంతా కుల గణన జరగాల్సిన అవసరం ఉందని.. దాని ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఒకప్పుడు నోటిఫికేషన్ల కోసం రాష్ట్రంలో ధర్నాలు జరిగేవన్నారు. గత పదేళ్లలో ఒక్క గ్రూప్-1 పరీక్ష సైతం నిర్వహించలేదని గుర్తు చేశారు. ఇక రూ.6 వేల కోట్లతో ఇలాంటి పథకాన్ని ఎవరూ ప్రారంభించలేదన్నారు. ఒక్కో నియోజకవర్గంలో 5 వేల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనతో ఫలితాలు పారదర్శకంగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం తెర మీదకు తీసుకు వచ్చింది. దాదాపు 5 లక్షల మందికి రూ.6 వేల కోట్ల వరకు రాయితీతో రుణాలు అందిస్తుంది. ఒక్కో లబ్దిదారుడికి రూ. 4 లక్షల వరకు మంజూరు చేస్తారు. 60 నుంచి 80 శాతం వరకు రాయితీతో రుణాలు అందజేయనుంది. ఈ పథకంలో దరఖాస్తులు స్వీకరణకు తుది గడువు ఏప్రిల్ 5వ తేదీ. ఏప్రిల్ 6 నుంచి మే 31 వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. జూన్ 2 వ తేదీన రాయితీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేయనుంది.

# ఏపీకి యూనివర్సిటీలు రాకుండా గత ప్రభుత్వం అడ్డుకుంది..

ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబిచ్చారు. తమ ప్రభుత్వం గతంలో, ప్రస్తుతం కూడా గ్రీన్ ఫీల్డ్ యూనివర్సిటీల ఏర్పాటును ప్రోత్సహిస్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా తీసుకొచ్చిన యూనివర్సిటీల చట్టం ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు అనుకూలంగా ఉందన్నారు. అయితే, గత ప్రభుత్వం ఈ చట్టానికి పలు సవరణలు చేసి ప్రైవేటు యూనివర్సిటీలను ఏపీకి రాకుండా అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. ప్రధానంగా కంపల్సరీ జాయింట్ సర్టిఫికేషన్ డిగ్రీస్ నిబంధన తీసుకొచ్చారని చెప్పారు. కనీసం 30 శాతం కోర్సు.. టై అప్ అయిన ఫారిన్ యూనివర్సిటీలో చదవాలని రూల్ పెట్టారు. అయితే, ఇలాంటి ఒప్పందం చేసుకోవాలంటే న్యాక్ అక్రిడేషన్ తప్పనిసరి అని యూజీసీ నిబంధనలు చెబుతున్నాయన్నారు. కనీసం రెండు గ్రాడ్యుయేట్ బ్యాచ్ లన్నా, 6 ఏళ్ల ఎగ్జిస్టెన్సీ ఉండాలని, వెయ్యికి పైగా పబ్లికేషన్స్ చేసుండాలి, క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ లో ఇన్ స్టిట్యూషన్స్ కనీసం 3 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ లు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో కనీసం 3 గ్రాడ్యుయేటింగ్ బ్యాచెస్ ఉండాలని యూజీసీ చెబుతోందన్నారు. యూనివర్సిటీల చట్టానికి ఐదేళ్ల పాలనలో ఐదుసార్లు సవరణలు చేసిందన్నారు. దీంతో ఈ చట్టం కాస్తా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలకు వ్యతిరేకంగా మారిందని మంత్రి వివరించారు. హయ్యర్ ఎడ్యుకేషన్ విషయంలో గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో చూస్తే ఆంధ్రప్రదేశ్ లో 36.5 శాతంగా ఉందని, పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రంలో ఈ రేషియో 47 శాతం, కేరళలో 48.3 శాతంగా ఉందని మంత్రి లోకేశ్ వివరించారు. కాగా, యూనివర్సిటీలు నిర్వహించే పరీక్షలకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. వర్సిటీలు వేటికవే ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల రిక్రూట్ మెంట్ విషయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని గుర్తించినట్లు మంత్రి తెలిపారు. బిట్స్ తో పాటు పలు యూనివర్సిటీలు ఆంధ్ర రాష్ట్రానికి వచ్చేందుకు సుముఖంగా ఉన్నాయని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల, యూనివర్సిటీల చట్టానికి వైసీపీ సర్కారు చేసిన సవరణల వల్ల ప్రైవేటు యూనివర్సిటీలకు అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. వీటిని తొలగించేందుకు యూనివర్సిటీల చట్టానికి మరోమారు సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి నారా లోకేశ్ మండలిలో పేర్కొన్నారు.

## మంత్రి లోకేశ్ ప్రసంగంలో ముఖ్యాంశాలు..

2016లో ఆనాటి ప్రభుత్వం ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన కోసం ప్రత్యేక చట్టం తీసుకు వచ్చింది. అందులో భాగంగానే విట్, ఎస్ఆర్ఎం, సెంచూరియన్, క్రియా యూనివర్సిటీ రాష్ట్రానికి వచ్చాయి. విట్, ఎస్ఆర్ఎం అమరావతిలో, సెంచూరియన్ విజయనగరంలో, క్రియా యూనివర్సిటీ నెల్లూరు జిల్లాలో ఏర్పాటయ్యాయి. అభివృద్ధి వికేంద్రీకరణకు ఆనాడు కూడా కట్టుబడి పనిచేశామనేందుకు ఇదొక ఉదాహరణ. ఏపీసెట్ ద్వారా 35శాతం సీట్లు భర్తీ చేయడం జరుగుతుంది. మిగతా 65 శాతం సీట్లు మెరిట్ ప్రకారం భర్తీ చేస్తారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విషయానికి వస్తే అడ్మినిస్ట్రేషన్ పర్పసెస్ కోసం యూనిఫైడ్ యాక్ట్ తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నాం. ప్రైవేటు విశ్వవిద్యాలయాల యాక్ట్ ను సమీక్షిస్తున్నాం. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉంది. దీనిపై పూర్తిస్థాయిలో మేం చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ ల విషయానికి వస్తే.. గవర్నెన్స్ కోసం గ్లోబల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్(గిగ్) ను కేబినెట్ లో ప్రతిపాదించాం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో పీహెచ్ డీ విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నారు. ఇందుకు పీజీ ఫీజు రీయింబర్స్ మెంట్ ఒక కారణం. దీనిపై అధ్యయనం చేస్తున్నాం. విశాఖలో ఏఐ యూనివర్సిటీ నెలకొల్పుతాం. ప్రభుత్వ వర్సిటీల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి, డ్రగ్స్ అణచివేత విషయంలో కూటమి ప్రభుత్వం కఠినంగా ఉంటుంది. ఈగల్ విభాగాన్ని ఏర్పాటుచేసి, సిబ్బందికి అదనంగా 30శాతం జీతాలు ఇస్తూ జీవో జారీచేశాం. ప్రతి యూనివర్సిటీ, స్కూల్స్ లో ఈగల్ కమిటీలు ఏర్పాటుచేసి చైతన్యం తీసుకువస్తాం.

## వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో

# రూ. 250 కోట్ల అవినీతి

మొదటి పేజి తరువాయి



ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందని పవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు 564 మండలాల్లో ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించిందని తెలిపారు. ఈ పరిశీలనలో అనేక అవకతవకలు బయటపడ్డాయని, ఉపాధి హామీ కింద ఖర్చు చేసిన నిధులపై అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పథకం ద్వారా వచ్చిన నిధులు లబ్ధిదారులకు చేరకుండా కొందరు మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లాయని డిప్యూటీ సీఎం ఆరోపించారు. ఇప్పటికే మొదలైన ఆడిట్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా మిగిలిన మండలాల్లో కూడా పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధి హామీ పనులను సమీక్షించి, అవినీతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇక ఉపాధి హామీ కూలీలకు వేతనాల పెంపు అంశం అనేది కేంద్రం పరిధిలో ఉంటుందని పవన్ వెల్లడించారు.

## మాకు చాలా విషయాలు తెలుసు... వాస్తవాలు చెబితే రేవంత్ రెడ్డికి ఇబ్బందులు తప్పవు



**హైదరాబాద్, :** "మాకు చాలా విషయాలు తెలుసు. మేం వాస్తవాలు చెబితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇబ్బందులు తప్పవు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీజేపీ నేతలతో రహస్య సమావేశాలను ఆయన ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. రహస్య భేటీలు అవాస్తవమైతే ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి రూ. 70 వేల కోట్ల ఆదాయం తగ్గిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారని వెల్లడించారు. ఇంతకంటే రాష్ట్రానికి ఘోర అవమానం మరొకటి ఉండదని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి బడ్జెట్ కంటే ముందే నేరాన్ని అంగీకరించి అప్రూవర్‌గా మారారని అన్నారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అట్టర్ ఫ్లాప్ అని అంగీకరించినట్లేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడానికి ముఖ్యమంత్రి అవలంబిస్తోన్న విధానాలే కారణమని ఆయన అన్నారు. కేసీఆర్ మీద ద్వేషంతో కాళేశ్వరం ప్రాజెక్టును బంద్ పెట్టి సాగును నాశనం చేశారని మండిపడ్డారు. ఫార్ములా ఈ-రేస్ వద్దని చెప్పిన ముఖ్యమంత్రి నగరంలో అందాల పోటీల నిర్వహణతో ఏం సాధిస్తారని ప్రశ్నించారు. అందాల పోటీలకు రూ. 2 వేల కోట్లు ఖర్చు చేసే బదులు మహిళలకు రూ. 2,500 చొప్పున ఇవ్వాలని సూచించారు. ఈ రేస్ వ్యవహారంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చాక మళ్లీ కేసును విచారిస్తామని అన్నారు.

## గ్రామీణ వైద్య ప్రవీణ అవార్డు అందుకున్న బి ఆర్ ఆంజనేయులు





శుభోదయం న్యూస్: సివి రామన్ అకాడమీ లలిత కళ అకాడమి సికింద్రాబాద్ వారు ఉగాది సంబరాలు లో భాగంగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు అవార్డులు కార్యక్రమం ప్రధాన ఉత్సవం బహుమతి ప్రధానం విశిష్ట సన్మానం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షులు బండి రామాంజనేయులు మచిలీపట్నం నుండి గ్రామీణ వైద్య ప్రవీణ అవార్డుకు ఎన్నికైనారు పేదలకు ఉచిత వైద్య సేవలు చేస్తూ సామాజిక సమాజ సేవలో అనేక సేవలు అందజేసి ప్రజలకు ప్రభుత్వానికి వారధి వలె అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం చేయు వైద్య కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తూ కరోనా సమయంలో పేద ప్రజలకు నిత్య అన్నదానం ఉచిత మందులు పంపిణీ సహజ అధికారులు అందించినందుకు గాను సమాజంలో ఉత్తమ సేవలు అందజేసి ఉత్తమ పురుషుడుగా ఉత్తమ గ్రామీణ వైద్యుడిగా సేవలందించిన గత 30 సంవత్సరాలుగా వైద్య రంగంలో పేదలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు ప్రజా వైద్యుడుగా ప్రధమ వైద్యుడిగా ఆత్మీయుడుగా ప్రజలలో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న బండి రామాంజనేయులు గ్రామీణ వైద్యున్ని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించి ఘనంగా సన్మానించడం జరిగింది. బండి రామాంజనేయులు గ్రామీణ వైద్యుడికి గ్రామీణ వైద్య ప్రవీణ అవార్డును బహూకరించి స్వర్ణఖంకనం రజిత కిరీటం తో ఘనంగా సన్మానించడం జరిగింది హైదరాబాద్ నందు గ్రామీణ వైద్య ప్రవీణ అవార్డు గ్రహీత బండి రామాంజనేయులు ఈ అవార్డు తనకు రావడం తనకు ఎంతో ఆనందాన్ని బాధ్యతను కలగజేసిందని ముందు ముందు ఇంకెన్నో కార్యక్రమాలకి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఈ అవార్డును ఎన్నిక చేసిన కమిటీకి అవార్డు ప్రధానం చేసిన లలితా కళా అకాడమీ సికింద్రాబాద్ వారుముఖ్య అతిథులకు గౌరవ అతిధులకు విచ్చేసిన సభ్యులకు ఈ అవార్డు ఇచ్చిన సంస్థకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసినార

## ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలి
## ఏపీ విప్ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య




ఎన్టీఆర్ జిల్లా, నందిగామ 16 మార్చి 2025: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ ఆంధ్రప్రదేశ్ విప్ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి భయాలూ లేకుండా విద్యార్థులంతా చక్కగా పరీక్షలు రాయాలని, మంచి ఫలితాలు సాధించాలని సౌమ్య ఆకాంక్షించారు. ఎండల దృష్ట్యా ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేస్తూ ప్రతి ఒక్క విద్యార్థి సకాలంలో పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని, ఎలాంటి ఒత్తిడికీ గురి కాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

## రాష్ట్రపతి అల్పాహారం విందుకు హాజరైన ఏలూరు ఎంపీ మహేష్ కుమార్



నూజివీడు ప్రతినిధి మార్చ్ 17 శుభోదయం న్యూస్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్ లో సోమవారం ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు సహచర పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులతో కలిసి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన పరిచయ కార్యక్రమంలో ఎంపీ మహేష్ కుమార్ చేతులు జోడించి రాష్ట్రపతి ముర్ముకు నమస్కరించారు. అనంతరంరాష్ట్రపతి ముర్ము ఇచ్చిన అల్పాహారం విందులో ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. చివరిగా రాష్ట్రపతి ముర్ముతో సహచర ఎంపీలతో కలిసి మహేష్ కుమార్ గ్రూప్ ఫోటో దిగారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ హార్దిక శుభాకాంక్షలు : డా. ఎం శాంతిరాం




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): పబ్లిక్ పరీక్షలను విద్యార్థిని, విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని ఆర్జీఎం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం శాంతిరాం సూచించారు. విద్యార్థిని,విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు అంటే ఆందోళన చెందకుండా మనసు ప్రశాంతంగా ఉంచుకొని పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కాకుండా ఉండాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకొని పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుందన్నారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ అదిరాజ్ సింగ్ రాణా




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): నంద్యాల జిల్లాలో మార్చి 17వ తేదీ సోమవారం నుంచి జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అదిరాజ్ సింగ్ రాణా నంద్యాల పట్టణ కేంద్రంలోని %ఙా+% హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షలు జరుగుచున్న విధానాన్ని పరీక్ష కేంద్రం వద్ద గల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం పరీక్షలు జరిగే తీరును అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాలు వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వ్రాత పరీక్షలలో విద్యార్థులు కు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేల పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు విధులు నిర్వర్తించాలన్నారు.విద్యార్థులు నిర్దేశించిన సమయంలోపు కేంద్రాల లోనికి క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలన్నారు.సెల్ఫోన్లు,స్మార్ట్ వాచెస్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతికి వీల్లేదని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసిన వరకు తెరవడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున విద్యార్థులను, అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది మినహా ఇతరులను అనుమతించరాదని సూచించారు.సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.పరీక్షలు పూర్తయ్యేవరకు అధికారులు మరియు సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.మాస్ కాపీయింగ్,మాల్ ప్రాక్టీస్ వంటి జరగకుండా పరీక్ష నిర్వాహకులు,అధికారులు సమన్వయంతో పటిష్టంగా విధులు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

## గ్యాస్ సిలిండర్ పేలుడు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో జనవరి నెలలో గ్యాస్ సిలిండర్ పేలి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి చాపిరేవుల గ్రామ ప్రజలు అండగా నిలిచారు. బోయ వెంకటమ్మ కుటుంబం జనవరి నెల లో తెల్లవారుజామున 4 గంటలకు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా 8 మందికి కాలిన గాయాలు అయ్యాయి.ప్రమాద బాధితులను కలిసి వివరాలను తెలుసుకొని,పరామర్శించి, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన చాపిరేవుల గ్రామ ప్రజలు.బాధిత కుటుంబం బోయ వెంకటమ్మ కుమారులైన లింగమయ్య, సుబ్బరాయుడులకు వారి కుటుంబానికి చేయూతనివ్వాలని గ్రామంలో కొంత సొమ్ముని వసూలు చేసి రూ.48,200/ మరియు కొన్ని చీరలను చాపిరేవుల పెద్ద మనుషుల సమక్షంలో అందజేశారు.మంచి పనికి మేము ముందుంటామని అని స్పందించి ఇందుకు సహకరించిన ప్రతి దాతకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు.

## దుర్గం మెకానిక్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ పదో తరగతి విద్యార్థులకు ఉచిత మంచినీరు ఏర్పాటు




కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరి దుర్గం మెకానిక్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థిని విద్యార్థులకు ఉచిత తాగునీరు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చింతలపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు




మాట్లాడుతూ విద్య అనేది సమాజంలో గౌరవాన్ని సమాజంపై అవగాహనను పెంపొందిస్తుందని అన్నారు. తోటి వారికి చేయూత అందించే అలవాటును ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని, నేటి విద్యార్థులు రేపటి ఉన్నత స్థాయిలోని అధికారులుగా మనం వారిని భావించి వారికి చేతనైన వరకు వివిధ రకాల రూపంలో అందరూ వారికి చేయూతను అందించాలని కోరారు. పదో తరగతి పరీక్ష రాసే ప్రతి విద్యార్థి, విద్యార్థినిలు ఉత్తీర్ణులు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వారందరికీ ఆల్ ది బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో దుర్గం మెకానిక్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, సెక్రెటరీ, సభ్యులు ఎం ఆదాం బేగ్, ఓబులేసు, సుధీర్ బాబు, ఖాసిం పిరా, మస్తాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వివిధ పాఠశాల చీఫ్ లు,ఎంఈఓలో సంజీవి, నారాయణరెడ్డి, విజయ లక్ష్మి, వెల్ స్పాన్, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి
## ఉగ్రనరసింహారెడ్డిని అభినందించిన స్పీకర్, మంత్రి, శాసన సభ్యులు




కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): అసెంబ్లీలో శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి ప్రాంత వైద్యశాలల గురుంచి ప్రస్తావించారు. ఇందుకు గాను సంబంధిత శాఖ మంత్రి సత్య కుమార్ సమాధానం ఇవ్వడమే కాకుండా కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తో పాటు అసెంబ్లీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, సహచర శాసన సభ్యులు అభినందించి ప్రశంసించారు. కనిగిరి తరహా మదర్ కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకాశం జిల్లాలోని శాసన సభ్యులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఉగ్రనరసింహారెడ్డిని తనతో సహా మిగిలిన శాసనసభ్యులు కూడా ఆదర్శంగా తీసుకోవాలి అని మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రత్యేకంగా అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎందుకంటే కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో కంగారు మదర్ కేర్ సెంటర్ ను పూర్తిగా సొంత నిధులు మరియు దాతల సహకారంతో నిర్మించారు. ఈ మదర్ చైల్డ్ కేర్ రాష్ట్రంలోనే మొదటగా కనిగిరిలోనే ఏర్పాటు చేయడం జరిగింది. ఇది చాలా అద్భుతంగా ఉంది. ఒక కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో కనిగిరిలో నిర్మించారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ కనిగిరి హాస్పిటల్ కు వెళ్ళి చూడాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ఇదే తరహాలో అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే ఇలాంటి సేవ ముఖ్యం అన్నారు. అనంతరం స్పీకర్ రఘురామ కృష్ణ రాజు స్పందిస్తూ మంత్రి సత్య కుమార్ యాదవ్ సమాధానం ఇవ్వటమే కాకుండా ఆదర్శప్రాయంగా మా ఉగ్రనరసింహ రెడ్డి ని తీసుకోవలన్నారు. మంత్రితో పాటు మరికొంతమంది శాసన సభ్యులను కూడా ఆ ఫెసిలిటీ చూపెడితే అది ఇంకెంతో మందికి స్ఫూర్తి దాయకంగా ఉంటుందని స్పీకర్ అన్నారు.

## ఫుడ్ బాస్కెట్ స్కీం పునరుద్ధరణతో చెంచు కుటుంబాలకు సరుకులు పంపిణీ



రెంటచింతల,మండల రిపోర్టర్ –శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : చెంచుగూడేల్లోని మహిళలు పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడకుండా వీరి కోసం కేంద్ర ప్రభుత్వం ఫుట్ బాస్కెట్ పథకానికి శ్రీకారం చుట్టింది. సంవత్సరంలో ఏడు నెలల పాటు పౌష్టికాహారం అందజేయాల్సిన ఈ పథకానికి గత వైకాపా హయాంలో అధికారులు పట్టించుకోలేదు. వివిధ పథకాల అమలుకు కేంద్ర నిధులు విడుదల చేసినా ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా చెంచుల ప్రగతిపై దృష్టి సారించపోవడంతో నేడు కూటమి ప్రభుత్వం చొరవ చూపడంతో చెంచుల సంక్షేమానికి శ్రీశైలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ( ఐ టి టి డి) ద్వారా నిత్యావసర సరుకులను అందజేస్తోంది. ఈ క్రమంలో స్థానిక రేగులమాణ్యంలోని చెంచు కుటుంబాలకు సోమవారం నూనె కందిపప్పు మరో 10 రకాల సరుకుల కిట్టును అధికారులు పంపిణీ చేశారు. దీంతో చెంచు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో టీడీపీ నేతలు మూలి రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, మారాజు శ్రీను, ఓరుగంటి ఇన్నారెడ్డి, పంచాయతీ సెక్రటరీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## గుడ్లూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్




కందుకూరు అర్స్ ఇంచార్జ్ – శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):గుడ్లూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఏర్పాటయింది సోమవారం నాడు గుడ్లూరు మండలంలోని పాస్టర్ కృపారావు మందిరంలో నూతనంగా అనేకమంది సభ్యుల సమక్షంలో ఈ కమిటీ ఎంపిక చేయడమైనది ప్రెసిడెంట్ జి దేవరాజు, వైస్ ప్రెసిడెంట్, జి ఇమ్మానుయేలు,సెక్రటరీ ఆర్ రూబేను, జాయింట్ సెక్రటరీ,జి కృపారావు ట్రెజరర్, టీ ప్రభాకర్ రావు అడ్వైజర్ వై దేవకుమార్ లను ఎన్నుకొనడం జరిగినది పాస్టర్ దేవకుమార్ చక్కటి సందేశాన్ని అందించి మండల స్థాయిలో ఏర్పడిన ఈ కమిటీ రానున్న రోజుల్లో నియోజకవర్గ స్థాయిలో ఎన్నో కార్యక్రమాలు విసతృతంగా నిర్వహించాలని ఉపదేశమందించారు దీనికి టి హేమలత జి నిర్మల మరియు గుడ్లూరు మండల స్థాయి పాస్టర్స్ పాల్గొన్నారు.

## బోగోలులో ప్రారంభమైన పదవతరగతి పరీక్షలు



(శుభోదయం న్యూస్) బిట్రగుంట: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పదవతరగతి పరీక్షలు సోమవారం బోగోలు మండలంలో ప్రారంభమయ్యాయి. మండలంలోని 16 గ్రామపంచాయతీలకు గాను మూడుపరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం458మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా446మంది హాజరయ్యారని,12మంది గైర్హాజరయ్యారనిమండల విద్యాశాఖఅధికారిజయమ్మ తెలిపారు.పరీక్షాకేంద్రాలైన విశ్వనాథరావుపేటబాలురఉన్నత పాఠశాలలో135మందికిగాను 133మంది,బాలికలఉన్నత పాఠశాలలో162మందికి161 మంది,అంబేద్కర్ గురుకుల పాఠశాలలో161మందికిగాను 152పరీక్షలకు హాజరయ్యారన్నారు.పరీక్షలు సజావుగానిర్వహించేందుకుపరీక్షా కేంద్రాలవద్దఅవసరమైనఅన్ని ఏర్పాట్లుచేశామన్నారు. నియోజకవర్గంలోపరీక్షలురాస్తున్న 10వతరగతివిద్యార్థులుఉత్తమ ఫలితాలుసాధించిఉజ్వల భవిష్యత్తుతోవెలుగొందాలని కావలిశాసనసభ్యుడుదగుమాటి వెంకటకృష్ణారెడ్డిశుభాకాంక్షలు తెలిపాడు.

## స్వామి వారి సన్నిధి ప్రాంతంలో చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మ



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద చంద్రపాటి సత్యనారాయణ–రంగనాయకమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రపాటి వెంకట రామమోహన్ రావు(రాంబాబు) –ఉదయలక్ష్మి ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బూర్లె రామసుబ్బారావు,జిట్టా శ్రీనివాసరావు,ఆర్.టి.సి డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ,ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కొత్తమాసు సత్యనారాయణ,వక్కల గడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ వారు ప్రభుత్వ చెరువులును కాపాడండి స్పందనలో ఫిర్యాదు చేసిన సిపిఐ పార్టీ




విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొడ్డాన.శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): బొబ్బిలి పట్టణంలో ఉన్నటువంటి పలు ప్రభుత్వ స్థలాలను ప్రభుత్వ చెరువులను కొంతమంది భూకబ్జాదారులు నుండి కాపాడాలని కోరుతూ స్థానిక ఎమ్మార్వో కార్యాలయం స్పందనలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ లు తహసీల్దార్ ఎం శ్రీను ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక గారికి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్నటువంటి పక్షుల బంధ. కోటి చెరువు భైరసాగరం. చీపురు బంద. కిచిడి బంద. అమ్మి గారి కోనేరు గట్టులలో పలు ప్రభుత్వ చెరువులు ఇప్పటికే సగం పైగా కబ్జాలకు గురయ్యాయని. అలాగే ప్రభుత్వ స్థలాలు ఇందిరమ్మ కాలనీ. ఐటిఐ కాలనీ. మిలట్రీ కాలనీ. లలో ప్రభుత్వ స్థలాలు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారని. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి బరితెగించి పచ్చని వ్యవసాయ భూముల్లో వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారని. బఫర్ జోన్లలో ఇటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వ నిబంధనలు చెబుతూ ఉంటే ఇవేవీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్టించుకోకుండా కొంత జిరాయితీ భూమిని కొని దానికి అనుకున్న ప్రభుత్వ భూములను తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమణలకు పాల్పడి కోట్లాది రూపాయలకు పడగలెత్తుతున్నారని అన్నారు పట్టణంలో ఉన్నటువంటి కోటి చెరువు. భైరిసాగరం పక్షుల బంధ పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని. తక్షణమే రెవెన్యూ యంత్రాంగం బొబ్బిలి పట్టణంలో ఉన్నటువంటి ప్రభుత్వ చెరువులపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ చెరువులను స్థలాలను కాపాడాలని కోరారు.

## విశాఖ డెయిరీ హౌస్ కమిటీ మీటింగ్ లో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన...!!!



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): ఈరోజు అమరావతిలోని అసెంబ్లీ కమిటీ హాల్లో సమావేశమైన విశాఖ డెయిరీ హౌస్ కమిటీ సభ్యులు..టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జ్యోతుల నెహ్రూ, వెలగపూడి రామకృష్ణ బాబు,గౌతు శిరీష,ఆర్.వి.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన)దాట్ల సుబ్బరాజు, అసెంబ్లీ సెక్రటరీ ప్రసన్న కుమార్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షల కు 620 మంది విద్యార్థులు హాజరు...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలంలో సోమవారం జరిగిన 10వ తరగతి పరీక్షలకు మొత్తం 620 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 15 మంది విద్యార్థులు గైహాజర్ అయినట్లు మండల విద్యాశాఖ అధికారి ఈడిగ రామా వెంకటేశ్వర్లు తెలిపారు. మండలం లో తుగ్గలి జడ్పీ పాఠశాల, తుగ్గలి నోవి ప్రైవేట్ పాఠశాల, జొన్నగిరి జడ్పీ పాఠశాల, ఆర్ఎస్ పెండేకల్ జడ్పీ పాఠశాల లో 10వ తరగతి పరీక్షలు జరిగాయని ఆయన తెలిపారు. జొన్నగిరి పరీక్షా కేంద్రంలో 167 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ఇద్దరు విద్యార్థులు హాజరు కాలేదని తెలిపారు. పెండేకల్ జడ్పీ పాఠశాలలో 164 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 5 మంది విద్యార్థులు హాజరు కాలేదన్నారు. తుగ్గలి జడ్పీ పాఠశాలలో 191 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 6 మంది హాజరు కాలేదన్నారు. తుగ్గలి నోవీ పాఠశాలలో 98 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ,ఇద్దరు విద్యార్థులు హాజరు కాలేదని తెలిపారు. ఈ సందర్భంగా తుగ్గలి, జొన్నగిరి ఎస్సైలు కృష్ణమూర్తి , రాజశేఖర్ లు పరీక్షా కేంద్రాల వద్ద తమ పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అలాగే ఎంఈఓ ఈడిగ రామా వెంకటేశ్వర్లు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

## ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ ప్రవేశ పెట్టాలి అఖిలేష్ యాదవ్ డిమాండ్



(శుభోదయం న్యూస్) మార్చ్ 17 బాపట్ల పట్టణం: మేధ శ్రీనివాసరావుబాపట్ల జిల్లా బాపట్ల సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (%ా+=ా% ) కార్యక్రమంలో సమాజవాది పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు సహచర పార్టీ నాయకులతో కలిసి రాబోయే ఎన్నికలలో భారతదేశంలో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ ప్రవేశపెట్టాలని గ్రీవెన్స్ దాఖ లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూప్రస్తుత లోక్ సభ సభ్యుల సంఖ్యకు సంబంధించి భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీ తరువాత మూడవ అతిపెద్ద పార్టీ అయినటువంటి సమాజవాది పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఇటీవల లోక్ సభలో మాట్లాడుతూ తమ పార్టీ ఉత్తర్ ప్రదేశ్ లోని 80 కి 80 లోక్ సభ స్థానాలు గెలిచి నప్పటికీ ఈవీఎంల కంటే తాను బ్యాలెట్ సిస్టం మాత్రమే ఉండాలని కోరుకుంటానని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇతర ఇండియా అలయన్స్ కూటమి సభ్యుల హర్ష ద్వాన ల మధ్య ప్రకటించడం జరిగింది నాడు బిజెపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈవీఎంలు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేస్తూ రాజ్యసభ ప్రోత్సహిత సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఈవీఎంల సామర్థ్యానికి సంబంధించి పుస్తకం కూడా రాసిన విషయాన్ని ఉదహరించారు అభివృద్ధి చెందిన అమెరికా ఇంగ్లాండ్ ఫ్రాన్స్ జర్మనీ తదితర దేశాలు ఈవీఎంలు ఎందుకు వాడటం లేదని ప్రశ్నించారు ఎలాన్ మస్క్ టెస్లా కంపెనీ సీఈఓ ఈవీఎంల వాడకము హై రిస్క్ తో కూడుకున్నది అని లో పోస్ట్ చేశారు ఇన్ని అనుమానాలు మరియు హ్యాకింగ్ సంబంధించి ఆరోపణలు మొదలైనవి ఉన్న దృష్ట్యా రాబోయే ఎన్నికలలో ఈవీఎంలు రద్దుచేసి బ్యాలెట్ తో ఎన్నికలు జరిపించాలని సమాజవాది పార్టీ డిమాండ్ చేస్తున్నట్టు తెలియజేశారుఈ కార్యక్రమంలో సమాజవాది పార్టీ నాయకులు మోర్ల చిన్న వెంకటేశ్వరరావు కాంద్రు శరత్ కుమార్ జయ రావు పేగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## బంగారు బాల్యం పై మండల స్థాయి అధికారుల సమావేశం



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : బంగారు బాల్యం పై ఎంపీడీవో బ్రహ్మయ్య అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో టాస్క్ ఫోర్సు కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది. కలెక్టర్ తమీ%శీ% అన్సారియా ఆదేశాల బంగారు బాల్యం పై మండల స్థాయి అధికారులు స్వచ్ఛంద సంస్థలు మండల స్థాయి సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశంలో బాల కార్మిక వ్యవస్థ పై, బాల్య వివాహాలు పై , బాలల అక్రమ రవాణా పై , విద్యార్థులు డ్రాప్ అవుట్స్ లను గుర్తించే వారిని పాఠశాలలో చేర్పించడం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించడం, వెట్టి చాకిరి నిర్మూలన, %శీ% నుండి 6 సంవత్సరాలలోపు బాల బాలికలకు ఆధార్ అప్డేట్ నిర్వహించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించి తీర్మానించడం జరిగింది. ఈ సమావేశం లో ఎంపిపి గంగసాని లక్ష్మీ,తహసిల్దార్ కేవీ రామారావు , ఐ సి డి ఎస్ సూపర్వైజర్ గోళ్ళ. పద్మజ , ఏపీఎం జి విద్యాసాగర్ , స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, పోలీస్ కానిస్టేబుల్, హెల్త్ డిపార్ట్మెంట్,అంగన్వాడి కార్యకర్త అమల, మండల సమైక్య అధ్యక్షురాలు ఓ సుబ్బమ్మ తదితరులు హాజరైనారు హాజరైనారు.

## విజయ్ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ను ప్రారంభించిన బోండా ఉమ, దారపనేని



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం వాస్తవ్యులు డాక్టర్ చెనికల శ్రీనివాసులు సోమవారం విజయవాడలో నూతనంగా విజయ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ను విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బోండా ఉమామహేశ్వరరావు, దారపనేని చంద్రశేఖర్ డాక్టర్ చెనికల శ్రీనివాసులను అభినందించారు. డాక్టర్ చెనికల శ్రీనివాసులు బోండా ఉమామహేశ్వరరావు ను, దారపనేని చంద్రశేఖర్ ను దుశ్శాలవ తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ టిడిపి నాయకులు దేవరపు మాల్యాద్రి,నూతలపాటి బాల వెంగయ్య, లక్ష్మయ్య, రాము, వెంకటేశ్వర్లు,చెనికల పెదమాల కొండయ్య, చిన్న మాల కొండయ్య, వెంకటయ్య, మల్లికార్జునరావు, డబ్బుగోట్టు కృష్ణయ్య, మానం మల్లికార్జునరావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ చెనికల నాగార్జున , భాను హాస్పిటల్ జనరల్ మెడిసిన్ డాక్టర్ శ్రీనివాస్, చెనికల కుటుంబ సభ్యులు, డాక్టర్లు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తిని విద్యార్థుల కాళ్ల దగ్గర పెట్టడం సమంజసమేనా? లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు...




విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): ఉపాధ్యాయుడు అయినా విద్యార్థులకు నేర్పించ వలసినది ఆత్మగౌరవంతో తన కాళ్ల మీద తాను నిలబడమని అంతేగాని వేరే వారి కాళ్ల మీద పడమని కాదు అని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. ఈ రోజు ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గంలో గత వారం ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రవర్తించిన తీరు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు అన్నారు. ఒక ఉపాధ్యాయుడేమో తన పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సరిగ్గా చదవడం లేదని, మాట వినడం లేదని మిమ్మల్ని మేము కొట్టలేం, తిట్టలేం అని గుంజీలు తీసి విద్యార్థులకు సాష్టాంగ నమస్కారం చెయ్యడం, ఇంకొకాయన ఒక కర్రతో తనను తాను చేతుల మీద కొట్టుకోవడం. ఈ రెండు సంఘటనలు సామాజిక మధ్యమాలలో వైరల్ అయిన తర్వాత ఈ సంఘటనలను చూసి ఆ ఉపాధ్యాయులను అభినందించి బాధ పడిన వారు ఉన్నారు అలాగే ఉపాధ్యాయులకు చదువు చెప్పడం చేతకాకపోతే వీరికి వేలల్లో జీతాలు ఎందుకు అని విమర్శించిన వారు ఉన్నారు. అయితే దీని మీద కాస్త విశ్లేషణ చెయ్యవలసిన అవసరం ఉంది. ఏ పాఠశాలలో అయినా అందరు విద్యార్థులు చదవరు. కొంత మంది సరిగ్గా చదవని వారు అలాగే చదివే పిల్లలని చెడగొట్టే వారు ఉంటారు అది సహజం. అప్పుడు ఉపాధ్యాయులు సహజంగా వారిని మందలించడం, వారి తల్లిదండ్రులకు చెప్పడం అలాగే వారిని మార్చడానికి ప్రయత్నించడం ఇది ప్రతీ పాఠశాలలోనూ జరుగుతుంది. పాఠశాలలో విద్యార్థులు అందరూ చదవడం లేదు మాట వినడం లేదు అనడం సరి కాదు. అందరూ చదవడం లేదు మాట వినడం లేదు అంటే ఆ పాఠశాలలోని చదువు చెబుతున్న ఉపాధ్యాయులందరూ అసమర్థులనే అనుకోవాలి. పాఠశాల ప్రారంభం అయి తొమ్మిది నెలలు అయి దాదాపుగా విద్యా సంవత్సరం పూర్తి కావస్తుంది మరి ఇంత వరకూ ఆ విద్యార్థులు చదవడం లేదని ఆ ఉపాధ్యాయులకు తెలియదా? మూడు నెలల కాలంలోనే విద్యార్థులలో ఎవరు సరిగ్గా చదువుతారో, ఎవరు చదవరో తెలిసిపోతుంది. బాగా చదవని వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి చదివించడం పాఠశాలలలో ఆనవాయితీ మరి ఆ ప్రయత్నం చేసారా? సరిగ్గా పదవ తరగతి పరీక్షల ముందే విద్యార్థులు చదవడం లేదని చెప్పడం ఏమిటి? అంటే పదవ తరగతి పరీక్షా ఫలితాలు అనుకూలంగా రాకపోతే ప్రభుత్వానికి సమాధానం చెప్పవలసి వస్తుందని ఆ నెపాన్ని విద్యార్థుల మీదకు, తల్లిదండ్రుల మీదకు నెట్టే ప్రయత్నం చేసారు అని కొంత మంది ప్రజలు అనుకుంటున్నారు. మరి ఈ ప్రశ్నకు సమాధానం వారి విజ్ఞతకే వదిలేద్దాం. పిల్లలు మొబైల్ ఫోన్లకు అలవాటు పడి చదవడం లేదు అంటున్నారు నిజమే. నేను చాలా ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించాను, చాలా మంది ఉపాధ్యాయులు విద్యార్థుల ముందే మొబైల్ ఫోన్లు వాడు తున్నారు. కొందరు ఉపాధ్యాయులయితే విద్యార్థులకు వర్క్ ఇచ్చేసి మొబైల్ ఫోన్ చూసుకోవడం చూసాను. మరి కొందరు ఉపాధ్యాయులయితే మరో అడుగు ముందుకు వేసి హెడ్ ఫోన్స్, బ్లూ టూత్ పెట్టుకుని పాఠశాల ఆవరణలోనే మొబైల్ ఫోన్లు పట్టుకుని తిరుగుతున్నారు. మరి ఇక్కడ తప్పు ఎవరిది? అసలు విద్యార్థులు ఎక్కువ సమయం గడిపేది పాఠశాలలోని ఉపాధ్యాయులతోనే, ఏ విద్యార్థికి అయినా ఆదర్శం వారికి చదువు చెప్పే ఉపాధ్యాయులే. మరి ఆ సంగతి మరచిపోతే ఎలా? కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పే పాఠశాల సమయంలోనే వారు సొంతంగా పెట్టుకున్న స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలలో పాల్గొంటున్నారు, ఆ కార్యక్రమాలాలో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులను వాడుకుంటున్నారు. మరి వారి మీద చర్యలు ఏవి? ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు పిల్లల మనస్తత్వ శాస్త్రం గురించి చెబుతారు. అందులో పిల్లలకు వారి మనస్తత్వాన్ని బట్టి చదువు ఎలా చెప్పాలో చెబుతారు. వారితో మమేకమై పాఠాలు చెప్పమని చెబుతారు, కార్పోరేట్ పాఠశాలలోని ఉపాధ్యాయులకు దాని మీద పూర్తి స్థాయి అవగాహన కూడా ఉండదు. మరి ఆ కార్పోరేట్ పాఠశాలలో క్రమశిక్షణగా ఉండి చదువుకోవడం విద్యార్థులకు సాధ్యం అయినప్పుడు ప్రభుత్వ పాఠశాలలలో ఎందుకు సాధ్యం కావడం లేదు? చాలా మంది ప్రభుత్వ పాఠశాలలలో చదువు చెబుతున్న ఉపాధ్యాయుల పిల్లల్ని పట్టణాలలో ఉన్న కార్పోరేట్ పాఠశాలలోనే చదివిస్తున్నారుగా మరి ఆ విషయం వారికి తెలియదా? ఏ వ్యవస్థలో అయినా లోటు పాట్లు ఉంటాయి వాటిని సరిదిద్దాలి అంతేగాని నాకు చేతకాదు అని కాళ్ల మీద పడితే పరిష్కారం అవుతుందా? అలా అయితే పోలీసు వారు శాంతి భద్రతల విషయంలో ప్రజలని కాపాడలేం అని చేతులెత్తి దణ్ణం పెడితే ప్రజల పరిస్థితి ఏమిటి? వైద్యులు అయితే ఎంతో ఒత్తడితో పని చేస్తారు ప్రతీ రోగితో ఓపిగ్గా మాట్లాడి వైద్యం అందిస్తారు వారే విసిగి ప్రజలకు వైద్యం చెయ్యలేం మాకు ఓపిక లేదు అని సాష్టాంగ నమస్కారం చేస్తే ప్రజల ఆరోగ్యం ఏమవుతుంది? కొంత మంది ఉపాధ్యాయులు మారు మూల గిరిజన గ్రామాలలో ఉన్న పాఠశాలలకు వెళ్లి నిబద్దతతో చదువు చెప్పే వారిని నేను చూసాను. ఇక్కడ ఈ పాఠశాలలు మైదాన ప్రాంతంలో ఉన్నాయి. గిరిజన గ్రామాలలో విద్యార్థులకు చదువు చెప్పడం చాలా కష్టం అలాగే వారి తల్లిదండ్రులకు వారి పిల్లల మీద పిర్యాదు చెయ్యడం అంత కన్నా కష్టం. మరి అలాంటి పరిస్థితులలో కూడా కొంత మంది ఉపాధ్యాయులు అక్కడ పిల్లలకు చదువు చెబుతున్నారు. అలా అయితే వారు ఇక్కడ పిల్లలకి చదువు చెప్పడం మా వల్ల కాదని ఎప్పుడో చేతులు ఎత్తి నమస్కారం చేసెయ్యాలి. అలా కష్ట పడి చదువు చెప్పే ఉపాధ్యాయులకు గుర్తింపు ఎక్కడ? సామాజిక మాద్యమాలలో ఓ వీడియో చక్కర్లు కొట్టగానే దాని మీద కనీస దర్యాప్తు లేకుండా ఎంత గుర్తింపు వచ్చింది. ఇదీ నేటి సమాజం తీరు. కార్పోరేట్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అక్కడ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుని చనిపోతుంటే ఏ ప్రజా ప్రతినిధి గాని, ఏ ఉపాధ్యాయుడు గాని ఏ మీడియా గాని స్పందించలేదు. మరి వారు పిల్లలు కాదా? ప్రభుత్వం ఉద్యోగులకు జీతం ఇస్తున్నది కొన్ని వ్యవస్థలను సక్రమంగా నడిపి గాడిలో పెట్టాలని అంతేగాని నాకు చేత కాదు అని తప్పించుకోమని కాదు. మేము చదువుకున్న రోజుల్లో ఉపాధ్యాయులు ఎంతో సృజనాత్మకతతో పాఠాలు చెబుతుంటే విన బుద్ధి అయ్యేది. నేడు అలా పాఠాలు చెప్పే వారిని వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. మేము చెయ్యలేం ఈ వ్యవస్థను చక్క దిద్దలేం మా వల్ల కాదు అని సాష్టాంగ నమస్కారం చేసిన వారిని సత్కరించి ఆకాశానికి ఎత్తాలా? లేక వారిని మందలించి ఈ వ్యవస్థను చక్కదిద్దే బాధ్యత నీదే నీకు జీతం ఇస్తుంది అందుకే అని వారి బాధ్యతను గుర్తు చెయ్యాలా? విజ్ఞులయిన వారు ఆలోచించండి. ఏ వ్యక్తి కూడా తన ఆత్మ గౌరవాన్ని ఎవరి కాళ్ల దగ్గర తాకట్టు పెట్టకూడదు. ఇది నాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు చెప్పిన గొప్ప మాట. అలాగే మనం చనిపోతే మన శవాన్ని మోసేందుకు చేతులు పోటీ పడాలి. ఇలాంటి గొప్ప మాటలు చెప్పి నాలో స్ఫూర్తిని కలిగించి నాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులందరికీ నా హృదయ పూర్వక నమస్కారములు.

## యాసరపు మాలకొండయ్యకు నివాళులు అర్పించిన....మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి మరియు గట్లా విజయ భాస్కర్ రెడ్డి



పామూరు, మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీ కి చెందిన వైసీపీ నాయకులు యాసరపు మాలకొండయ్య(76) మృతి చెందిన విషయం తెలుసుకొని ఈరోజు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి.. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు..ఈ కార్యక్రమంలో బాసు మాలకొండారెడ్డి,సైకం పుల్లారెడ్డి,తుమ్మా పిచ్చిరెడ్డి,తాతిరెడ్డి రాజు,కందుల సుబ్బారెడ్డి,తిండి నరసింహారెడ్డి,జడ యేసయ్య, జడ దావీదు, జడ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు..


## పెద్ద మనసుతో ముందుకొచ్చిన సహాయం మానవత సంస్థ






పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ఏర్పాటు విద్యార్థిని ముప్పవరపు షైనీ రైలు యాక్సిడెంట్ అయిన విషయాన్ని తెలుసుకొని మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా దాతల సహాయంతో 41700 రూపాయలు షైనీ అన్న అయినా అజయ్ చేతికి అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ముసలయ్య, తోటా రమేష్, వి వెంకటేశ్వరరెడ్డి, పి తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరావు, తిరుపతి రెడ్డి బిఎస్ రంగ తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు.



దోర్నాల మండల రిపోర్టర్– ఆవులయ్య ( శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం తిమ్మాపురం గ్రామము లో లింగమయ్య కొండపైన మండల ప్రజల సహాయ సహకారాలతో రామలింగేశ్వర స్వామి భ్రమరాంబ దేవి అమ్మవారు వెలసినారు. తిమ్మాపురం గ్రామం వాడపల్లి బాల కాశయ్య ఆర్టీసీ డ్రైవర్ సోమవారము రామలింగేశ్వర స్వామి భ్రమరాంబ దేవి అమ్మవారికి పంచామృత అభిషేకం కుంకుమాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాడపల్లి బాల కాశయ్య మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామం లింగమయ్య కొండపైన వెలసిన రామలింగేశ్వర స్వామి భ్రమరాంబ దేవి అమ్మవార్లకు ఆభరణాలు కిరీటము ధ్వజం తొడుపు చేయించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. దాతల సహాయ సహకారాలతో అమ్మవారికి ఆభరణాలు కిరీటము ధ్వజం తొడుపు చేయించిన దాతల పేర్లను గుడి పైన ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా దాతలు సహాయ సహకారాలు అందించే వారు ఫోన్ నెంబర్ 7382891066 ను సంప్రదించాలని వాడపల్లి బాల కాశయ్య కోరారు.

## పట్టపగలె మహిళ మెడలో బంగారు చైన్ లాకెళ్లిన దొంగ.





దోర్నాల మండల రిపోర్టర్– ఆవులయ్య (శుభోదయం న్యూస్ ):ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం దోర్నాల పట్టణంలో పట్టపగలే ఒక మహిళ మెడలో ంచి బంగారు చైన్ ను దుడంకుడు సోమవారం లాక్కెళ్ళాడు. వివరాల్లోకి వెళితే దోర్నాల పట్నంలోని వెచ్చ వెంకటసుబ్బయ్య నగర్ రెండవ వీధిలో చిదెళ్ల శ్వేత అనే మహిళ సోమవారము ఇంటిముందు నించుని ఉంది. గుర్తు తెలియని ఒక వ్యక్తి ఆమె మెడలో నుంచి బంగారు చైన్ లాక్కెళ్ళారు. పెద్ద దోర్నాల ఎస్ఐ వి మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన సీసీ కెమెరాల్లో నమోదయింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి మహేష్ సూచించారు. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి నిందితుని పట్టుకునే చర్యలు చేపడుతున్నారు. స్థానిక ప్రజలు భద్రత చర్యలను కట్టుదిట్టం చేయాలని పోలీసులను కోరుతున్నారు.

## వ్యవసాయ అధికారులకు హెూం కంపోస్టింగ్, పోషక, కిచెన్ గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్



సింగరాయకొండ, మండల రిపోర్టర్ – పసుమర్తి జాలయ్య శుభోదయం న్యూస్):– సింగరాయకొండ మండలంలోని సహాయ వ్యవసాయ సంచాలకుల వారి కార్యాలయం నందు సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతు సేవ కేంద్రం సిబ్బందికి మరియు వ్యవసాయ అధికారులకు హెూం కంపోస్టింగ్, పోషక, కిచెన్ గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ నిర్వహించడం జరిగినది సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ నిర్మల కుమారి అధ్యక్షతన ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అయినది. డి పి డి ఆత్మ ఎం విజయనిర్మల ఈ శిక్షణ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించి అందరూ రైతు సేవ కేంద్ర సిబ్బంది వెలుగు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి అందరి భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా తెలిపారు. డిటిసి డి ఆర్ సి ఎస్ రామ్మోహన్ వివిధ రకాల కంపోస్ట్ పిట్ ల తయారీ గురించి మిద్దతోటల మరియు పెరటి తోటల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతు సేవ కేంద్ర సిబ్బంది ఈ శిక్షణ కార్యక్రమంలో పూర్తి సమాచారాన్ని తెలుసుకొని వారి సందేహములను కూడా నివృత్తి చేసుకోవలసిందిగా ఈ సందర్భంగా తెలియజేశారు. డి ఆర్ సి ఎ డి ఎ జే వెంకట్రావు హైడ్రోపోనిక్ కల్టివేషన్ గురించి వివరించారు డి ఆర్ సి వ్యవసాయ అధికారులు వి వెంకట శేషమ్మ, ఏ శైలజారాణి హెూమ్ కంపోస్టింగ్, పోషక కిచెన్ గార్డెన్, మరియు పెరటి, మిద్దోటల పెంపకం గురించి పి పి టి ద్వారా వివరించారు. ఈ కార్యక్రమం నందు నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరాయకొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద పకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాల్ ప్రారంభం




సింగరాయకొండ, మండల రిపోర్టర్ – పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):– సింగరాయకొండ మండల వ్యవసాయశాఖ అధికారి ఎం ఏ ఓ సుధాకర్ ఆధ్వర్యములో ఎంపీడీఓ కార్యాలయములో ప్రకృతివ్యవసాయ పద్ధతులలొ ఆరోగ్యవంతమైన కూరగాయలు ఆకుకూరలు పండ్లును మండలములోని ప్రకృతివ్యవసాయం సిబ్బంది స్థాల్ పెట్టడం జరిగింది అక్కడ కూరగాయలు ఆకుకూరలు పండ్లు కొనగోలు చేయడం జరిగింది ప్రతి సోమవారం స్థాల్ పెట్టడం జరుగుతుంది ప్రస్తుతము రసాయనాలు పురుగుమందులతో పండించిన కూరగాయలు ఆకుకూరలు పండ్లు తినడం వలన అనేక జబ్బులకు గురిఅవుతున్నాము కనుక ఆరోగ్యావంతమైన ఎలాంటి రసాయనాలు పురుగు మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు కషాయలతో పండించిన కూరగాయలు ఆకుకూరలు పండ్లు తీసుకొని మీకుటుంబ సభ్యులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియచేయడం జరిగింది ఏ వెంకటరమణ మండల ఇంచార్జ్ ప్రకృతివ్యసాయ విభాగం

## సింగరాయకొండలో గంజాయి విక్రయదారుడి అరెస్ట్



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- సింగరాయకొండ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గారి ఆధ్వర్యంలో గంజాయి అమ్మకం మరియు వాడకం పై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సింగరాయకొండ నుండి కందుకూరు వెళ్లే రోడ్డుకు కుడి వైపున ఉన్న చేపల మార్కెట్ వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఎక్సైజ్ అధికారులు అతడిని నిలిపివేసి ప్రశ్నించారు.ఆ వ్యక్తిని తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి దొరికింది. అతను గంజాయిని ఒల్సురి శివ వద్ద కొనుగోలు చేశానని వెల్లడించాడు. దాంతో ఎక్సైజ్ అధికారులు ఒల్సురి శివ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.అనుమానితుడిని అదుపులోకి తీసుకుని సింగరాయకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న ఒల్సురి శివను త్వరలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## జనసేన ఆధ్వర్యంలో
## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: బాపట్ల పట్టణం గడియార స్తంభం వద్ద,పార్టీ నాయకులు కామిశెట్టి సాయిబాబు ఆధ్వర్యంలో అక్షయ హెల్పింగ్ హాండ్స్ చలివేంద్రాన్ని ప్రారంభించిన బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మందపాటి ఆంధ్రేయ, కుట్టు బోయిన రమేష్, సబినేని కిషోర్, శాలెం మరియు జనసేన పార్టీ నాయకులు పసుపులేటి మహేష్ , వినోద్ , కోకి నరేష్ , ఒంగోలు రాఘవేంద్ర , డిగేలా అజయ్ , షేక్ బాజీ ,తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వంద పడకల వైద్యశాల పున ప్రారంభించాలి : ఎమ్మెల్యే చిర్రి



శుభోదయం న్యూస్, జీలుగుమిల్లి: పోలవరం నియోజకవర్గంలోని ఏజెన్సీ గ్రామాలలో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు కోరారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని వైద్య సదుపాయాలు కల్పించాలని అన్నారు .ఆ గ్రామాలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని కోరారు .గత ప్రభుత్వంలోని నియోజకవర్గంలోని కొయ్యలగూడెం ,టీ నర్సాపురం ,బుట్టాయిగూడెం మండలాలలో నిర్మాణాలు ప్రారంభించి బేస్మెంట్ వరకే పరిమితం అయ్యాయని వాటిని పట్టించుకోలేదని తెలిపారు. గిరిజన గ్రామాలలో వైద్యం అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇకనైనా ఆగిపోయిన హాస్పిటల్స్ ని నిర్మాణం చేపట్టి వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని స్పీకర్ని, సంబంధిత ఆరోగ్య శాఖ మంత్రిని కోరారు. అసెంబ్లీ సమావేశాలలో పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు ఏజెన్సీలో వైద్య సేవలు గురించి మాట్లాడటంతో అందరూ ఆయనని ప్రశంసించారు.

## అమరవీరుడు పొట్టి శ్రీరాములు చరిత్రను
## విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో ఉండేలాగా అమలు చేయండి



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: చల్లా రామయ్య,తెలుగు రాష్ట్రం ఆంధ్రుల హక్కు అని నినాదాలిచ్చి ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా బాపట్లలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బాపట్ల వైఎస్ఆర్పీపి దివ్యాంగులు విభాగం అధ్యక్షులు సంచార జాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చల్లా రామయ్య విలేఖరులతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల సాధకుడు పొట్టి శ్రీరాములు అని తెలుగు రాష్ట్రం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేమని తెలియజేస్తూ మన ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు చదువుకునే పాఠ్య పుస్తకాలలో పొట్టి శ్రీరాములు పేరును కీర్తిస్తూ ఆయన చరిత్రను ప్రతి ఒక్కరూ చదివేలా ఈ కూటమి ప్రభుత్వం అమలు చేయించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో బాపట్ల జిల్లా మేనేజర్ రంగయ్య, డి. రాము , చల్లా చిరంజీవి, దార్ల సురేష్, చల్లా కొండయ్య, పెంద్రా బాబు తదితరులు పాల్గొన్నారు.

## సగానికి సగం ఎండిపోయిన
## వరి పంటలకు నష్టపరిహారం చెల్లించాలి.

### ప్రజా పోరాట సమితి (పి ఆర్ పి ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి డిమాండ్



యాదాద్రి భువనగిరి జిల్లా (శుభోదయం న్యూస్ ):మార్చి 18 భూగర్భ జలాలు ఇంకిపోవడం వల్ల,బోర్ల నుండి నీరు రాకపోవడం వల్ల,ధర్మారెడ్డి పల్లి కాలువ, పిల్లాయిపల్లి కాలువల నీరు ప్రవహించకపోవడం వల్ల, ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం స్వప్నంగానే మారడం వల్ల, నల్లగొండ జిల్లా రైతాంగం సాగునీటి సమస్యలు అపరిష్కృతంగా మారి,కొద్దో గొప్పో వేసిన వరి పంట సగానికి సగం ఎండిపోయి, రైతాంగం శోకసంద్రంలో మునిగిందని దానిని ప్రభుత్వం రెవెన్యూ, వ్యవసాయ శాఖల ద్వారా సర్వే చేయించి,రైతాంగాన్ని ఆదుకోవడానికి తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలని" ప్రజా పోరాట సమితి (పి ఆర్ పి ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి డిమాండ్ చేశారు.రామన్నపేట మండలం ఉత్తటూరు,చిట్యాల మండలం వనిపాకల గ్రామాల్లో ఎండిన వరి పంటలను పరిశీలించి, రైతాంగాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ పి ఎస్ నాయకులు ఏనుగు నర్సిరెడ్డి,నాగిళ్ల యాదయ్య, బర్రె సంజీవ,బట్టు శ్రీశైలం యాదవ్,గుండెబోయిన నరసింహ ముదిరాజ్,గ్యార నాగరాజు,మాచర్ల సంజీవ, అశోక్,సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## కోమ్మాయిగూడెం జిల్లా పరిషత్
## ఉన్న పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



యాదాద్రి భువనగిరి జిల్లా శుభోదయం న్యూస్ మార్చి 18 రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎర్ర జ్యోతిబసు కలెక్టర్ గా కొండగడప రంజిత్ కుమార్, హెడ్మాస్టర్ గా కొండగడప సాయిచంద్ వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్ సఫియా బేగం, కోట విజయ,వెంకన్న, నాగమణి,శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ చారి,గడ్డం శ్రీనివాస్,సమీన్ గార్లు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం
# సేవలో స్ఫూర్తిగా నిలుస్తున్న కుర్ర రంగ నాయక్ నానిలి





శుభోదయం న్యూస్: ప్రజల హక్కుల కోసం, సామాన్యుల సంక్షేమం కోసం, అన్యాయాన్ని ఎదుర్కొంటూ నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమైన వ్యక్తి కుర్ర రంగ నాయక్ నాని . పేదలు, అనాథలు, వృద్ధులు, విద్యార్థులు, నిరుపేద కుటుంబాలు ఎవరైనా కష్టాల్లో ఉంటే, వారికి అండగా నిలిచి, సహాయం చేయడం ఆయన నిత్యకృత్యంగా మారింది. "నాకు పదవులకంటే ప్రజల ప్రేమ ముఖ్యమైంది!" అని చెప్పే ఈ మహామనిషి, సేవకే తన జీవితాన్ని అంకితం చేశారు.

### పేద ప్రజలకు అండగా వారికి ఆశాకిరణంగా మారిన నేత

పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, స్టేషనరీ సామాగ్రి అందజేస్తూ, వారి భవిష్యత్తుకు బలమైన బాట వేస్తున్నారు.ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలకు ఆహారం, దుస్తులు, వైద్య సహాయం అందిస్తూ, వారికి కొత్త ఆశనిస్తూ ముందుకు సాగుతున్నారు.అధికారుల నిర్లక్ష్యం వల్ల పేదలకు అందని ప్రభుత్వ పథకాలను వారికి చేరేలా కృషి చేస్తున్నారు. వృద్ధులకు పెన్షన్, వికలాంగులకు ప్రభుత్వ అనుమతులు, నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు.

### రక్తదానం వేలాది ప్రాణాలకు ఆయువుపట్టుగా మారిన సేవా యోధుడు

"రక్తదానం చేయడమే నిజమైన మానవత్వం!" అనే నినాదంతో కుర్ర రంగ నాయక్ నాని అనేక రక్తదాన శిబిరాలను నిర్వహించి, ఎందరో రోగులకు ప్రాణదాతగా నిలిచారు.అత్యవసర రోగులకు రక్తసాయం అందించేందుకు ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటు చేసి, ఎప్పుడైనా ఎక్కడైనా అవసరమైన వారికి తక్షణమే రక్తాన్ని అందించేలా వ్యవస్థను నిర్మించారు.ఆసుపత్రుల్లో రక్తం కొరతతో బాధపడే రోగులకు రక్తాన్ని అందించి, వేలాది ప్రాణాలను కాపాడిన మహోన్నత సేవగణం."నా బిడ్డ ప్రాణం నిలిచిందంటే, అందుకు కారణం కుర్ర రంగ నాయక్ నాని !" అంటూ పలువురు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. "మీరు రక్తదానం చేస్తే, మరొకరి కుటుంబానికి వెలుగు వస్తుంది" అని యువతను చైతన్యపరుస్తూ, వారిని రక్తదానం చేయించేలా ప్రేరేపిస్తున్నారు.

### ప్రజా సమస్యలపై నిబద్ధతతో గళమెత్తిన ధీరుడు

ప్రభుత్వ పాలనలో లోపాల వల్ల ప్రజలు నష్టపోతే, దీనిపై అధికారులను నిలదీసే ధైర్యం, వారి నిర్లక్ష్యాన్ని ప్రశ్నించే ధీమా కుర్ర రంగ నాయక్ నాని సొంతం. తాగునీటి సమస్యలు, రోడ్ల లేమి, విద్యుత్ సమస్యలు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందకపోవడం వంటి అంశాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్నారు. అవినీతిపరులను బహిర్గతం చేస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ప్రశ్నిస్తూ, ప్రజల తరపున పోరాటం చేస్తున్నారు.

### "ప్రజల హక్కుల కోసం నా జీవితం అంకితం!" అంటూ నిరంతరం ప్రజాసేవలో పాటుపడుతున్నారు

### "ప్రజల సేవే నా ధ్యేయం!"యువతకు మార్గదర్శకుడిగా మారిన నాయకుడు

"పేద ప్రజలకు అండగా ఉండటమే నా జన్మధర్మం" అనే తపనతో స్వార్థం లేకుండా ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కుర్ర రంగ నాయక్ నాని, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. నిజమైన నాయకుడు అనిపించుకోవాలంటే పదవులు కాదు,

### ప్రజల సంక్షేమమే ముఖ్యం అని నిరూపిస్తున్న వ్యక్తి!

### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహా సేవగుణం

కుర్ర రంగ నాయక్ నాని వంటి నిజమైన ప్రజాసేవకులు మరింతగా ఎదగాలని, సామాన్య ప్రజలకు మరింత సేవ అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు! "నాయకుడు అనిపించుకోవడం కాదు, నిజమైన నాయకత్వం చాటాలి" అనే మాటను నిజం చేస్తూ, కుర్ర రంగ నాయక్ నాని తన సేవా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.

## పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ప్యాడ్లు,పెన్నులు పంపిణీ



యాదాద్రి భువనగిరి జిల్లా శుభోదయం న్యూస్ మార్చి 18 రామన్నపేట మండలం దుబ్బాక జడ్పీ హైస్కూల్లో డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ మరియు కంబాల శివలీలా స్వచ్ఛంద సంస్థా ఆధ్వర్యంలో గుండాల ప్రసాద్ అధ్యక్షతన టెన్త్ క్లాస్ బాల,బాలికలకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమము ఉద్దేశించి మాట్లాడుతు కంభాల శివలీల,పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీ మేడం మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు పట్టుదలతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు సమాజానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు.ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమమైనవి అని నిరూపించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి,డివైఎఫ్ఐ కార్యదర్శి గుండాల అనిల్ కుమార్,అధ్యక్షులు కంబాల పల్లి గిరి,మాజీ డివైఎఫ్ ఐ గ్రామ ఆదక్షులు గాధే రాజ్ కుమార్,నాయకులు,గాధే పరమేష్,కంభహలపల్లి శ్రీశైలం,భగత్ సింగ్ యువ నాయకులు నవీన్ కుమార్, కొమ్ము నాగరాజు, లింగస్వామి,రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తాత్కాలిక నివాసం ఏర్పాటు చెయ్యండి - నాగేళ్ల సాయికిరణ్.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్) కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో ఇటీవల అగ్నిప్రమాదం తో 3 ఇళ్లు పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే నేడు భాజపా మండల పార్టీ ఆధ్వర్యం లో బాధితులతో కలిసి మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మార్వో లత తో నాగేళ్ళ సాయి కిరణ్ మాట్లాడుతూ వారికి ప్రస్తుతం ఉండడానికి ఇళ్లు కూడా లేదు కావున వారి కుటుంబానికి తక్షణ సాయం చేయాలి వారికి వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అప్పటికి వరకు ఉండడానికి వారికి తాత్కాలికంగా నివాసం ఉండడానికి స్థావరం ఏర్పాటు చేయాలి లేక పోతే బీర్కూర్ గ్రామ%శీ% లో నిర్మించిన ఉన్న డబుల్ బెడ్ రూమ్ లో 3 ఇళ్ల నీ వాళ్లకు ఇవ్వాలి అని కోరారు బాధితుల కు పూర్తిస్థాయిలో న్యాయం చేసేవారకు పోరాటం చేస్తామని బిజెపి మండల అధ్యక్షులు నాగేళ్ల సాయి కిరణ్ అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు నాగేళ్ల సాయి కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి యోగేష్, బిజెపి సీనియర్ నాయకులు హన్మా%శీ%డ్లు, నూకల రాము, రాజు, సాయిబాబా, బస్వరాజు, ఆవారి శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు

## విజయ్ చందర్ రెడ్డి త్వరగా కోలుకోవాలి
## లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన బిజెపి శ్రేణులు...



శుభోదయం న్యూస్, గీసుగొండ: బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన బిజెపి నాయకులుబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి కి ఇటీవల గుండె శాస్త్ర చికిత్స జరుగగా గీసుగొండ మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో శ్రీ కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ చందర్ రెడ్డి త్వరగా కోలుకొని మళ్లీ ప్రజా జీవితంలో, వైద్య వృత్తిలో ప్రజలకు సేవలందించాలని స్వామివారిని మొక్కుకున్నారు .ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ మెంబర్ నిమ్మగడ్డ జాన్ విక్రమ్ తలనీలాలు స్వామి వారికి సమర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నిమ్మగడ్డ జాన్ విక్రమ్,నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, నాయకులు ఏడాకుల రాజిరెడ్డి, ఆకుల వెంకన్న, మరిపూడి శ్రీనివాస్, మరిపూడి రోశయ్య,ఉట్ల రాసుధరెడ్డి,ఆరకట్ల ప్రవీణ్, కోట శివ కుమార్ ,కేలోత్ రమేష్,కాగితాల సాయి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను
## ఆశీర్వదించిన ఎరవెల్లి స్వర్ణ వరద ఈశ్వరరావు



పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్) : వర్దన్నపేట మండలం కట్ర్యాల ఉప్పరపల్లి క్రాస్ రోడ్డులోని కళ్యాణ లక్ష్మి గార్డెన్స్ లో నాంపల్లి రమాదేవి-రవీందర్ గార్ల కుమారుని వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి శ్రీ ఎర్రబెల్లి స్వర్ణ-వరదరాజేశ్వర్ రావు ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, చైర్మన్ కన్నయ్య, వర్దన్నపేట మండల అధ్యక్షులు ఎద్దు సత్యం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోశాల వెంకన్న, గజ్జెల సదయ్య,బండారి సతీష్ గౌడ్,కొండేటి మధుకర్,కందిక ఏళ్లస్వామి,బచల్ల స్వామి,ఎనిమి రామ్ చంద్రారెడ్డి,రాజ్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## : నూతన వధూవరులను ఆశీర్వదించిన బొత్స సందీప్..

చీపురుపల్లి ):గరివిడి పట్టణం స్థానిక సూర్య సదనంలో కుప్పిలి సురేష్ ప్రసన్న దంపతుల వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ధీరా ఫౌండేషన్ అధినేత, వైసీపీ యువ నాయకులు డాక్టర్ బొత్స సందీప్ పాల్గొని వధువు, వరులను ఆశీర్వదించారు. యంపీపీ ప్రతినిధి మీసాల విశ్వేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ ముల్లు రాంబాబు, ఆర్టీసీ యూనియన్ నాయకులు కే చంద్రమౌళి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాలి:జిల్లా ఎస్.పి. .డి.ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్ జిల్లా : మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి. .డి.ఉదయ్ కుమార్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ మరియు సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం
## రాంగ్ రూటులోప్రమాదం.

గన్నవరం.:గన్నవరం మండలం చిన్న అవుటపల్లి ఆర్టీవోచెక్ పోస్ట్ వద్దజాతీయరహదారిపైరోడ్డుప్రమాదంజరిగింది..ఈప్రమాదానికికారణ%శీ%అతివేగమెంటున్నారు.అతివేగం గా రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న వైనం.విజయవాడ నుండి ఏలూరు వైపు వెళుతున్న లారీని, చిన్న అవుటపల్లి వెస్ట్ బైపాస్ నుండి రాంగ్ రూట్లో అతివేగంగా వచ్చి ఏలూరు వైపు వెళుతున్న లారీని ఢీ కొట్టిన టిప్పర్ లారీ.టిప్పర్ లారీ ఢీకొన్న దాటికి లారీ క్యాబిన్లో ఇరుక్కుని డ్రైవర్ కి రెండు కాళ్లు చిద్రమయ్యాయి.రాంగ్ రూట్లో అతివేగంగా లారీని ఢీకొట్టిన టిప్పర్ లారీ డ్రైవర్ పరారైయ్యాడు. క్షతగాత్రున్ని లారీ క్యాబిన్ లో నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం చిన్న అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ హాస్పిటల్ కి తరలించారు.జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదంకారణంగాకిలోమీటర్లుదూరంనిలిచిపోయినవాహనాలు.సంఘటనా స్థలానికి చేరుకున్న ఆత్కూరు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాలను మళ్లించి, వివరాలు సేకరిస్తున్నారు.కెసునమోదుచేసుకునిదర్యాప్తుచేస్తున్నపొలీసులు.

## డీఎస్సీ లో 40 సంవత్సరాలుగా
## భర్తీ కానీ కళలు ఆర్ట్ క్రాఫ్ట్ డాన్స్ మ్యూజికల్ పోస్టులు
## ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి
## టిటిసి కళాకారునకు ఘన సన్మానం

అల్లూరి జిల్లా :-ఏపీ రాష్ట్ర కళలు డ్రాయింగ్ డాన్స్ మ్యూజికల్ టిటిసి కోర్స్ ప్రభుత్వం ద్వారా ప్రతి సంవత్సరం పరీక్షల కోసం టిటిసి ఫీజులు కళాకారులు చెల్లిస్తుంటారు ప్రతీ సంవత్సరం మే నెల నుండి జూన్ 12 వరకు టిటిసి ట్రైనింగ్ ప్రభుత్వం ద్వారా టిటిసి సర్టిఫికెట్లు పొందినప్పటికీ నేటికీ 40 సంవత్సరాలు పైబడుతున్న ఏ ఒక్క డీఎస్సీ ద్వారా కూడా కళలు పోస్టులు డ్రాయింగ్ క్రాఫ్ట్ డాన్స్ మ్యూజికల్ భర్తీ చేయటం లేదు.ఆ తరుణంలో పాడేరు ఏజెన్సీ నుండి అప్పటి 2008 సంవత్సరంలో ప్రభుత్వ దృష్టికి తెలిపిన గిరిజన టిటిసి ఆర్ట్ కళాకారుడు జనపరెడ్డి అప్పారావు తెలపగా తదుపరి ప్రభుత్వ ఆర్ సి నెంబర్ 34425 హైదరాబాద్ ప్రభుత్వ రికార్డు నందు నమోదు కాబడి ఉంది. అప్పటి నుండి ప్రభుత్వం కళల పోస్టుల కోసం దృష్టి సారించి ఉమ్మడి తెలంగాణ ఆంధ్ర లో అన్ని పాఠశాలల్లో డ్రాయింగ్ క్రాఫ్ట్ పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్ అని ఒక ఆదేశాలను జారీ చేస్తూ అదే నేటికీ కొనసాగిస్తున్నారు. మొట్టమొదటిసారిగా ప్రభుత్వం దృష్టికి టిటిసి చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉపాధి లేక టిటిసి చేసిన అభ్యర్థులు ఉన్నారని ప్రభుత్వానికి తెలియజేశారు.అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో టిటిసి చేసిన అభ్యర్థులు ఉన్నారని తెలియపరిచిన జనపరెడ్డి అప్పారావు కు ఆదివారం నాడు విశాఖపట్నంలో కళలు ప్రాంతీయ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళలు టిటిసి యూనియన్ జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు,రాష్ట్ర టిటిసి సైకం శివ కుమారి రెడ్డి, విశాఖ టిటిసి యూనియన్ బి రవి చంద్ శంకర్ మరియు టిటిసి కళాకారులు శ్రీకాకుళం జిల్లా విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి జిల్లా,అల్లూరి సీతారామరాజు జిల్లా,టిటిసి కళాకారులు సమక్షంలో జనపరెడ్డి అప్పారావు కు ఘన సన్మానం చేశారు.

## తప్పులు తడకగా ఉన్న
## రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ రిపోర్టును,
## ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్
## ఆమోదించటం సిగ్గుచేటు. బి ఎస్ పి.

అమలాపురం( ప్రభ న్యూస్):రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీల వర్గీకరణ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా చేయడానికి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ రిపోర్టును ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ ఆమోదించడం సిగ్గుచేటని బహుజన సమాజ్ పార్టీ అమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ పాలమూరి మోహన్ బాబు అన్నారు తప్పుల తడకగా ఉన్న రిపోర్టు చంద్రబాబు ప్రభుత్వం మాలలపై కక్షతో వెనువెంటనే వర్గీకరణ చేయడానికి కుతూహలం పడుతుందని ఇది చాలా అన్యాయమని తక్షణమే రాజీవ్ రంజాన్ మిశ్రా రిపోర్టు రద్దుచేసి హైకోర్టు రిటైర్డ్ జడ్జిల చే త్రిసభ్య కమీషన్ ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు

## మంచినీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసిన మహిళలు



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదేల రామారావు (శుభోదయం న్యూస్) మండల పరిధిలోని అంకుషాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోనీ బంజారుపల్లి కాలనీలో గత 15 రోజుల నుండి మంచినీళ్లు రాకపోవడంతో నిరసనగా సోమవారం కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులుగా మంచినీళ్లు రావడంలేదని ఏ పని చేయాలన్నా కావాల్సింది మంచినీరు. అలాంటి నీటి సరఫరా జరగకపోవడంతో కనీసం బాత్రూం వెళ్లడానికి నీరు లేక ఇబ్బంది పడుతున్నామని, నీటి సమస్యను స్థానిక పంచాయతీ కార్యదర్శి దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లిన వారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేది ఏమీ లేక చుట్టుపక్కల గల వ్యవసాయ బావులు, బోర్ల వద్ద నీళ్లు తీసుకోవలసిన దుస్థితి నెలకొందని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు తమ బాధని అర్థం చేసుకొని వీలైనంత త్వరగా మంచినీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరడం జరిగింది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చిత్రపటానికి పాలభిషేకం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో



రామగుండం మండలం రిపోర్టర్ – తిరు, (శుభోదయం న్యూస్) గోదావరిఖని పట్టణంలో స్థానిక గోదావరిఖనిలోని ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం తరఫున విలేకరుల సమావేశం జరిగింది. ఈ విలేకరుల సమావేశంలో



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు ఎండి ఆసిఫ్ పాషా గారు, తాజా మాజీ కార్పొరేటర్ ఎండి.ముస్తఫ పాల్గొని, మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తూ, ముస్లిం సోదరుల కుటుంబాల వివాహ కార్యక్రమాలు నిర్వహించుకొనుటకు షాదీ ఖానా నిర్మాణాలకు రెండు కోట్ల రూపాయలు మంజూరుకు కృషి చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారికి మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,మంత్రి శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు గారికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. అనంతరం స్థానిక గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం తరుపున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు,రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గార్ల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నెక్కొండ మండలం బిజెపి నాయకులు



పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్) : 17 డివిజన్ వసంతాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగమూర్తి ప్రథమ పుత్రుడు వివాహానికి చిరంజీవి రాజ్ కుమార్ లావణ్య వివాహానికి హాజరై నిండు మనసుతో ఆశీర్వదించిన నెక్కొండ బీజేపీ మండల పార్టీ సీనియర్ నాయకుడు గడ్డల సతీష్ వారి బృందం ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో కావటి రాజు సంఘ శరత్ నవీన్ కుమార్ సాంబ రాజ్ నాగరబోయిన మహేష్ అమ్మ జగన్ అటిక రాజు నల్లగుంట్ల ప్రవీణ్ కుమార్ సీనియర్ నాయకులు కడుదల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్పల్లి మున్సిపల్ లో నూతనంగా ఎం.వి.ఆర్ డిజిటల్ ప్రారంభం చేసిన ఎమ్మెల్యే కాల యాదయ్య



శుభోదయం ప్రతినిధి, శంకరపల్లి : శంకర్ పల్లిలోని నూతనంగా ఎం.వి.ఆర్ డిజిటల్ ప్రారంభించడం జరిగింది ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని రకాల శుభకార్యాలకు రాజకీయ పెక్సీలు మరియు షాపింగ్ ఫ్లెక్సీలు అన్ని విధాల ప్రజలకు అందుబాటు ధరలకు ఉంటాయని షాప్ యజమాని వెంకటేష్ ముద్రాజ్ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య శంకర్పల్లి సాత ప్రవీణ్ కుమార్ గోపాల్ రెడ్డి పాండురంగ రెడ్డి రాజేశ్వర్ గౌడ్ భాస్కర్ రెడ్డి నాయుడు కుమార్ రాఘవేందర్ రామకృష్ణారెడ్డిముదిరాజ్ సంఘం అధ్యక్షులు మరియు నాయకులు.

## బెల్లంపల్లి ఎస్సీ బాయ్స్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వార్డెన్ కోరుట్ల శ్రీనివాసు ను సస్పెండ్ చేసి విధుల నుండి శాశ్వతంగా తొలగించాలి.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి – శ్రీనివాస్‌శుభోదయం న్యూస్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో డిడి గారికి ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ... బెల్లంపల్లి పట్టణంలో ఎస్సీ బాయ్స్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా మెనూ ప్రకారం భోజనం పెట్టకుండ అరటి పండ్లు, కోడిగుడ్లు కొన్ని రోజుల నుండి ఇవ్వకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా పెట్టినట్టు రికార్డుల్లో తప్పుడు లెక్కలు చూపెడుతు విద్యార్థుల కడుపులు కొట్టి దోచుకుంటున్నాడు అని అన్నారు. అంతేకాకుండా గతంలో మందమర్రిలో హాస్టల్ వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్న సందర్భంలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన విద్యార్థి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగి ఒక విద్యార్థి చనిపోవడం జరిగింది విద్యార్థి చావుకు కారణమైన వార్డెన్ కోరుట్ల శ్రీనివాస్ ను సస్పెండ్ చేసారు అతని పై విచారణ జరుగుతున్న సందర్భంలో అతనికి మళ్లీ బెల్లంపల్లి ఎస్సీ హాస్టల్లో వార్డెన్ గా బాధ్యత ఇవ్వడం వల్ల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంతో విద్యార్థుల రోడ్ల పై కి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు విద్యార్థులకు పరీక్షల సమయంలో వారి యొక్క జీవితాలతో చెలగాటమాడుతున్నాడు కావున విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇలాంటివి పునరావృతం కాకుండా తక్షణమే విచారణ జరిపించి ఆ యొక్క వార్డెన్ పై చర్యలు తీసుకొని సస్పెండ్ చేసి శాశ్వతంగా విధులు నుండి తొలగించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు... ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్, తెలంగాణ విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు రేగుంట క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు...

# గోదావరి గోసను కేసీఆర్ కు విన్నవించేందుకు గోదావరిఖని టూ ఎర్రవెల్లి మహాపాదయాత్ర

రామగుండం మాజీ శాసనసభ్యులు
పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ
అధ్యక్షుడు కోరుకంటి చందర్





గోదావరిఖని టౌన్ రిపోర్టర్– సురేష్, (శుభోదయం న్యూస్) వృధాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను ఒడిసి పట్టి ఎంతో గొప్పగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి తెలంగాణ తొలి సిఎం కేసీఆర్ గారు గోదావరినదికి జీవం పోస్తే అబద్ధాపు హామిలతో అధికారంలోకి వచ్చిన రెవంత్ సర్కార్ గోదావరినదిని ఎండబెట్టి రైతులను ప్రజలను అరిగొస పెడుతున్నరని గోదావరినదిని ఎడారిగా మార్చిన ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డికి దక్కుతుందని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిగొసను, ప్రజల రైతులు బాధలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి విన్నవించేందుకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కో ఆర్డినేటర్ బోడ్డు రవీందర్ ఆధ్వర్యంలో గోదావరి గొస మహ పాదయాత్రను మాజీ మంత్రి కోప్పుల ఈశ్వర్ ప్రారంభించగా మాజీ జడ్పి పుట్ట మధుకర్ మాజీ శాసనసభ్యులు దివాకర్ రావు, రఘువిర్ సింగ్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ మాట్లాడుతూతెలంగాణ ఉద్యమ సమయంలో ఎండిన గోదావరితో రైతన్నల కన్నీళ్లు, కష్టాలను చూసి చలించిపోయిన కేసీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టులో కన్నీళ్లను తుడిస్తే.. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరం కూలిందని నెపం మోపి నీటిని దిగువకు వదిలి తెలంగాణను ఎండబెట్టిందని విమర్శించారు. కాళేశ్వరం అంటే ఏదో ఒక చిన్న ఆనకట్ట కాదని, కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బరాజ్‌లు, 15రిజర్వాయర్లు, 19సబ్ స్టేషన్లు, 21పంపు హౌస్లు, 200 కిలో మీటర్ల సొరంగాలు, 1530కిలో మీటర్ల గ్రావిటీ కెనాళ్లు, 98కిలో మీటర్ల ప్రెజర్ మెంట్స్??, 141టీఎంసీల కెపాసిటీ ఉన్న 530మీటర్ల ఎత్తుకు ఎత్తిపోయడం, 240టీఎంసీల ఉపయోగంతో కాళేశ్వరం ప్రాజెక్టును గొప్పగా నిర్మించారని అన్నారు. కాళేశ్వరం ఎండబెట్టడం వల్లే తెలంగాణలో రైతన్నల పంట పొలాలు ఎండుతున్నాయని ప్రజలకు వివరించే విధంగా ఈ 180కిలో మీటర్ల యాత్ర సాగుతుందన్నారు. తెలంగాణ బీళ్లకు సస్యశామలం చేసేందుకు కేసీఆర్ గారు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరినదిని నిండుకుండలగా మార్చి రైతులకు సాగునీరు, తాగునీరు అందించారన్నారు. అపర భగీరథుడు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కడితే కడుపు మంటతో మేడిగడ్డ పేరుతో కాళేశ్వరాన్ని ఎండబెట్టి గోదావరి కన్నీటి గోసకు కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టేందుకోసం చేపట్టిన గోదావరి తల్లి కన్నీటి గోస మహాపాదయాత్ర చేపట్టామన్నారు. గోదావరి తల్లి కన్నీటి గోసను వివరిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టత, కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఈ నెల 22వరకు ఉద్యమాల పురిటి గడ్డ నుంచి గోదావరిఖని నుంచి ఎర్రవెల్లికి 180కిలో మీటర్ల మహా పాదయాత్ర కొనసాగనుందన్నారు. రామగుండంలో అగ్గి అంటుకున్నదని మరో యుద్ధం మొదలైందని ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా సాగుతుందన్నారు. ఈ మహా పాదయాత్ర అన్నధాతల కష్టాలను, కన్నీళ్లను ప్రజలకు వివరించుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మూల విజయ రెడ్డి, మాజీ జడ్పీటీసి అముల నారాయణ, కౌశిక హరి, మాజీ కార్పోరేటర్లు పెంట రాజేష్, బాదె అంజలి, కల్వచర్ల కృష్ణవేణి, ముదాం శ్రీనివాస్, నాయకులు బోడ్డుపల్లి శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, నూతి తిరుపతి, జె.వి రాజు, రాకం వేణు చల్లా రవీందర్ రెడ్డి, వడ్డెపల్లి శంకర్, కౌటం బాబు, కుడుదుల శ్రీనివాస్, ఆడప శ్రీనివాస్, జక్కుల తిరుపతి, మేడి సదానందం, బండారి ప్రవీణ్, ఆర్నపల్లి శ్రీనివాస్, కోల్లూరి సతీష్, ఎడివెల్లి శ్రీనివాస్, ధరని రాజేష్, ధర్మాజి కృష్ణ, గంగధరి రాములు, కొల సంతోశ్, ఇంజపురి నవీన్, సారయ్య నాయక్, చింతకింది సంపత్, దొమ్మేటి వాసు, ఇరుగురాళ్ల శ్రావణ్, ముల్లల కోమురయ్య, పట్ల మధు, ఉప్పు రాజ్ కుమార్, బోబ్బలి సతీష్, పిల్లి రమేష్, మామిడాల ప్రభాకర్, బుర్ర వెంకన్న, రామారాజు, కిరణ్ జీ, ముద్దసానిసంధ్యారెడ్డి, ఆవునూరి వెంకటేష్, అతారోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ సిఎల్పీ లో మంత్రులు మరియు ఎమ్మెల్యేలతో కలిసి సమావేశంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్– తిరుపతి, (శుభోదయం న్యూస్) కాంగ్రెస్ పార్టీ బీసీ ఎమ్మెల్యేల తో మరియు సహచర మంత్రి వర్యులు కొండా సురేఖ గారి తో సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్ బిర్ల ఐలయ్య,ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, ప్రకాష్ గౌడ్ ,ఈర్లపల్లి శంకరయ్య, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. నేడు శాసన సభలో బీసీ లకు స్థానిక సంస్థల్లో ,విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ బిల్లు ప్రవేశపెట్టనుండడంతో బిల్లు సజావుగా అన్ని పార్టీల మద్దతు ఇచ్చేలా మాట్లాడాలని నిర్ణయం.దేశంలో మొదటి సారి చారిత్రాత్మక బీసీ రిజర్వేషన్లు పెంచుతూ బిల్లు ఆమోదం పొందిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క,ఇతర మంత్రులతో కలిసి జాతీయ స్థాయిలో ఇతర పార్టీల నేతలను కలిసి రిజర్వేషన్ల పెంపు మద్దతు కోరాలని సమావేశంలో చర్చించడం జరిగింది.

## పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు ,స్టేషనరీ పంపిణీ చేసిన అనంతుల రవి గుప్త..



మంగపేట, మండల రిపోర్టర్ – తులసి (శుభోదయం న్యూస్):సోమవారం రోజున పీఎం శ్రీ రాజుపేట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీ బానోతు బాలాజీ అధ్యక్షతన,పదవ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అనంతుల రవి గుప్త పరీక్షకు సంబంధించిన స్టేషనరీ ఉచితంగా పంపిణీ చేశారు......ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు కర్రీ రామ్మోహన్ అభ్యర్థన మేరకు రవి గుప్త 55 మంది విద్యార్థులకు గాను ఎగ్జామినేషన్ ప్యాడ్స్, పెన్ను, స్టేషనరీస్ వస్తువులను పంపిణీ చేశారు. అదేవిధంగా వీరు జడ్.పి.హెచ్.ఎస్ మంగపేట, జడ్పీహెచ్ఎస్ మల్లూరు, పాఠశాలలకు కూడా పంపిణీ చేశారు. అదేవిధంగా తిమ్మంపేట స్వగ్రామమైన అనంతుల రవి గుప్త మంచి దాన గుణం తోటి గత ఐదు సంవత్సరాలు దగ్గర నుండి విద్యార్థిని, విద్యార్థులకు వీటిని పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుశ్రీ బానోతు బాలాజీ మాట్లాడుతూ, సమాజంలో ఇటువంటి దానగునము ఉన్న సోషల్ వర్కర్ పాఠశాల నుండి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో ఉపాధ్యాయ బృందం: దాట్ల పద్మ,చీపు రామారావు, గుండారపు శ్రీనివాస్, కొత్తపల్లి పోశన్న, బరిగల రాజయ్య, %ఎ%.రాజ్యలక్ష్మి,గడ్డం శ్రీనివాస్, కారం గణేష్, డోకుపర్తి ప్రవీణ్ కుమార్,మద్దెల నాగమణి, శనిగరపు జమున పాయం వీరనారాయణ, వజ్జా సుజాత, రాస మల్ల సురేందర్...

## ఆర్థిక సహాయం అందజేత



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన పటం లింగమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించడం జరిగింది. ప్రముఖ పారిశ్రామికవేత్త సీ ఎన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5,000/ ఐదు రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిలకమర్రి కనకాచారి ఆవుల సత్యనారాయణ ఆవుల అంజయ్య పటం వెంకటయ్య పటం నరేష్ పటం శ్రీకాంత్ వెంకటేశం బుర్ర మల్లేశం బొరుగుల భాగ్యమ్మ బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు ఆవుల బిక్షం సోషల్ మీడియా కన్వీనర్ కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావద్దు - సైకాలజిస్ట్ పోగు అశోక్



తెలంగాణ స్టేట్ బ్యూరో కటిదల రామారావు (శుభోదయం న్యూస్) పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావద్దని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పోగు అశోక్ అన్నారు. ఈనెల 21 నుండి రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను రాయబోతున్నారు. ఈ సమయంలో విద్యార్థులలో తెలియని భయం, ఒత్తిడి ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి విద్యార్థులు పరీక్షలు అంటే ఎలాంటి భయం లేకుండా, ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పోగు అశోక్ విద్యార్థులకు సూచిస్తున్నారు. నేను బాగా చదవగలను, నేను పరీక్షలను బాగా రాయగలను, నాకు మంచి ఫలితాలు వస్తాయి, అనే ఆశావాహ దృక్పథంతో, మీ మీద మీకు నమ్మకం కలిగి ఉండాలని, మీ మీద మీకు విశ్వాసం ఉండాలని, మహోన్నత విశ్వాసాల నుండి మహత్తర విజయాలు సాధించబడతాయి అని, ఆత్మవిశ్వాసం మీ ఆయుధమైతే విజయం మీ బానిస అవుతుందని, ప్రతి సబ్జెక్టును ప్రణాళిక ప్రకారం ఇష్టపడి చదవాలి, ఆసక్తితో చదవడం వల్ల అద్భుత ఫలితాలు వస్తాయి. ఆసక్తి ఉంటే ఏ శక్తి మిమ్మల్ని ఆపలేదు అని చెబుతున్నారు. విద్యార్థులు ఈ సమయంలో మనసులో ఎలాంటి నెగటివ్ ఆలోచనలు దరిచేరనీయకుండా, తాము గతంలో సాధించిన విజయాలు, సందర్భాలను గుర్తుకు చేసుకుంటూ ఉండాలి. దీనివలన విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరిగి ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయగలుగుతారు. పట్టుకుంటే పాదరసంలా జారిపోయే సమయం అత్యంత విలువైనదిగా గ్రహించి బంగారంలో ఉన్న ప్రతి చిన్న కణానికి ఎంతటి విలువ ఉందో ఇప్పుడు మీ ముందున్న ప్రతిక్షణం అంతే విలువైనదిగా భావించి, సమయపాలన పాటించి పరీక్షలకు సిద్ధం కావాలి. ఈ సమయంలో విద్యార్థులు మీ యొక్క సమయాన్ని వృధా చేసే సెల్ ఫోన్లు టీవీలు చాటింగ్ లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. సాగిపోయే కాలం మీ కోసం ఆగిపోదు, కరిగిపోయే ప్రతిక్షణం మీకోసం పెరిగిపోదు, అందుకే కాలం వెంట పరిగెత్తు విజయాలను సాధించు అని మహాత్ముడు అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకుంటూ ప్రతి విద్యార్థి పరీక్షలు అద్భుతంగా రాయాలని సూచిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులు ఆహారం విషయంలో జాగ్రత్త వహించాల్సి ఉంటుంది సాత్విక ఆహారం- శాఖాహారం తొందరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ లకు దూరంగా ఉండాలి. మధ్య మధ్యలో తగినంత నీటిని తీసుకోవడం ఉత్తమం. ఈ సమయంలో విద్యార్థులు ఎవరైనా ఒత్తిడికి లోనైతే, పరీక్షలంటే భయం కలిగినట్లయితే వాటిని తొలగించడానికి తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ విద్యార్థులకు తోడ్పాటును అందిస్తుందని, విద్యార్థులు **9391117100,9440890073** ఫోన్ నెంబర్లను సంప్రదించి తమ ఒత్తిడిని,భయాన్ని తొలగించుకోవచ్చు అని సైకాలజిస్ట్ పోగు అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

## లడఖ్‌లో 1,275 గెజిటెడ్ పోస్టులు ఖాళీ




న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ శాఖల్లోనూ..కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ ఉద్యోగాలు భర్తీకి నోచుకోవటంలేదు. ఇందుకు ఉదాహరణే లడఖ్. లడఖ్‌ను కేంద్రపాలిత ప్రకటించి ఆరేళ్లయినా ఇక్కడ 1,275 గెజిటెడ్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చినప్పటి నుంచి ఈ పోస్టులను భర్తీ చేయలేదని కేంద్రం పార్లమెంటరీ ప్యానెల్‌కు తెలిపింది. వివిధ విభాగాల్లో మొత్తం 3,596 నాన్-గెజిటెడ్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని కేంద్ర హౌం మంత్రిత్వ శాఖ మార్చి 10న సమర్పించిన నివేదికలో డిపార్ట్‌మెంట్-సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హౌం వ్యవహారాలకు తెలిపింది. 3,172 పోస్టులకు నియామకాలు స్టాఫ్ సెలక్షన్ కమిషన్, అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ సబార్డినేట్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, , కార్గిల్, లడఖ్ పోలీస్ బోర్డు, ఇతర విభాగాల ద్వారా జరిగాయని పేర్కొంది. దీనితో పాటు.. లడఖ్‌లో శాసనసభ లేకపోవడంతో ఇక్కడ ప్రజల్లో భూమి, వనరులు, జీవనోపాధి గురించి అభద్రతాభావం పెరిగింది . ఈ ప్రాంతం యొక్క సాంస్కృతిక గుర్తింపు, పర్యావరణ వ్యవస్థ ప్రమాదంలో పడుతుందనే భయాలు రేకెత్తించాయి.

## బిజెపి సభ్యులు వివాదాలు సృష్టించాలని చూస్తున్నారు




హైదరాబాద్: గోడలు దూకడం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు అలవాటని, ఆ అలవాట్లే అందరికీ ఉంటాయనుకుంటున్నారని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ట్యాపింగ్, స్టింగ్ ఆపరేషన్లు చేయడం మీకు అలవాటే కదా అని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పై స్టింగ్ ఆపరేషన్ చేశారా? అని ప్రశ్నించారు. కెబినెట్ విస్తరణ ఇప్పట్లో ఉంటుందనుకోవడం లేదని చెప్పారు. తిరుపతిలో తెలంగాణ మంత్రుల లెటర్లు అనుమతించాలని త్వరలో ఎపి సిఎం చంద్రబాబు నాయుడును కలిసి కోరతానని తెలిపారు. బిజెపి సభ్యులు వివాదాలు సృష్టించాలని చూస్తున్నారని వెల్లడించారు. తెలంగాణను వ్యతిరేకించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని, కేంద్ర సంస్థలకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుంటే మాకు అభ్యంతరం లేదని తెలియజేశారు. దేవదాయ శాఖ పరిధిలోని భూములను రక్షిస్తామని, అన్యాక్రాంతం కాకుండా మహిళలకు లీజ్ కు ఇస్తామని పేర్కొన్నారు. అన్ని దేవాలయాలను ఒకే గొడుగు కిందకు తెస్తామని, ప్రతి ఆలయ ఖర్చులు థర్డ్ పార్టీతో ఆడిట్ చేపిస్తామని కొండా సురేఖ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిపోతోంది



హైదరాబాద్: వినూత్న పరిష్కారాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల పెంపునకు క్లీన్ ఎనర్జీ పాలసీ-2024ను ఆవిష్కరించారు.ఆ తర్వాత, ఈ లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్రం స్వతంత్ర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, తేలియాడే సౌరశక్తి, వ్యర్థాల నుండి శక్తి, గ్రీన్ హైడ్రోజన్ వంటి 2030 నాటికి 20 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి, 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారని భట్టి చెప్పారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను ప్రోత్సహించడానికి పాలసీ తెచ్చామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిపోతోందని తెలియజేశారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తున్నామని, పంప్డ్ స్టోరేజ్, ఫ్లోటింగ్ విద్యుత్ ప్రోత్సాహానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రూ. లక్ష కోట్ల మేర పెట్టుబడులకు సంస్థలతో ఎంవోయూలు ఉన్నాయన్నారు. కాలుష్య రహిత, తక్కువ ధరకు విద్యుదుత్పత్తికి దోహదం చేస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.ఎ

## రెండు పుట్టిన రోజుల వ్యోమగామి



కల్పనా చావ్లా.. అంతరిక్షానికి వెళ్లిన తొలి భారతీయ మూలాలు కలిగిన మహిళగా పేరొందారు. ఈ విషయం అందరికీ తెలిసిందే.. అయితే ఆమె పుట్టిన రోజు విషయంలో విరుద్ధ వాదన వినిపిస్తుంది. ఆమె పుట్టిన తేదీ 1962 మార్చి 17 అని కొందరు.. కాదు కాదు 1961, జూలై ఒకటి అని కొందరు చెబుతుంటారు. ఇంతకీ దీనిలో ఏది సరైనది? కల్పనా చావ్లా హర్యానా లోని కర్నాల్‌లో 1962, మార్చి 17న జన్మించారు. బాల్యంలో ఆమె విమానాలన్నా, విమాన ప్రయాణాలన్నా ఎంతో ఆసక్తి చూపేది. ఈ ఆసక్తితోనే ఆమె తన తండ్రితో పాటు స్థానిక ఫ్లయింగ్ క్లబ్‌కు తరచూ వెళుతుండేది. అక్కడి విమానాలను చూసి మురిసిపోతుండేది. తరువాత ఆమె అమెరికా చేరుకుని, 1991లో అమెరికా పౌరసత్వం పొందింది. మీడియా దగ్గరున్న సమాచారం ప్రకారం ఆమె 1962, మార్చి 17న జన్మించింది. అయితే కల్పనా మెట్రిక్ పరీక్షకు హాజరయ్యే సమయానికి ఆమె వయస్సు సరిపోకపోవడంతో ఆమె తండ్రి ఆమె పుట్టిన తేదీని 1961, జూలై ఒకటిగా అధికారికంగా మార్పించారు. దీంతో ఆమె మెట్రిక్ పరీక్ష కు హాజరు కాగలిగింది. అమెరికాలోని రికార్డులలో ఆమె పుట్టిన తేదీ 1961 జూలై ఒకటిగానే ఉంటుంది. నాసా అధికారిక రికార్డులలోనూ ఆమె పుట్టినరోజు జూలై ఒకటి అని కనిపిస్తుంది. అయితే ఆమె కుటుంబ సభ్యులు, పరిచయస్తులు ఆమె పుట్టినరోజును మార్చి 17నే నిర్వహించుకుంటారు. కల్పనా చావ్లా పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఎయిరోనాటిక్ ఇంజినీరింగ్ డిగ్రీ అందుకున్నారు. అనంతరం 1982లో అమెరికా చేరుకుని, అక్కడి యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్ నుంచి ఎయిరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. 1986లో ఆమె మరో మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు. తరువాత పీహెచ్‌డీ చేశారు. 2023, జనవరి 16న కల్పనా చావ్లా.. నాసాకు చెందిన కొలంబియా స్పేస్ షటిల్ నుంచి అంతరిక్షానికి చేరుకున్నారు. తరువాత ఆమె భూమికి తిరిగి రాలేకపోయారు. కల్పనా ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌక 2023 ఫిబ్రవరి ఒకటిన భూమికి తిరిగి వస్తుండగా, కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో కల్పనా చావ్లాతో పాటు మొత్తం ఏడుగురు వ్యోమగాములు మృతి చెందారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు ఆయన పేరు పెడదాం: సీఎం



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుపై యూనివర్సిటీలు, సంస్థలు ఉంటే పరిపాలనా పరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దాన్ని పరిష్కరించేందుకే రాష్ట్రంలోని యూనివర్సిటీలు, సంస్థలకు తెలంగాణకు సంబంధించిన పేర్లు పెడుతున్నామని చెప్పారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్, తెలుగు వర్సిటీ పేరు మార్పు తదితర బిల్లులు ప్రవేశపెట్టిన నేపథ్యంలో సీఎం మాట్లాడారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు.

# నడి సముద్రంలో 95 రోజులు

## ప్రాణాలతో బయటపడిన పెరూ మత్స్యకారుడు




పది రోజుల చేపల వేటకని ఆయన బయలుదేరాడు. తుఫాను దారిని మళ్లించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన పసిఫిక్ మహాసముద్రంలో కొట్టుకుపోయాడు. ఎటు చూసినా నీళ్లు. నెల.. రెండు నెలలు.. మూడు నెలలు.. సముద్రంలోనే జీవితం. సరైన ఆహారం లేదు. మంచి నీరు కూడా లేదు. అయినా బతకాలన్న ఆశ అతడిని ఒడ్డున చేర్చింది. 95 రోజుల తరువాత గస్తీ బృందానికి దొరికాడు. సినిమా స్టోరీని తలపిస్తున్న ఈ కథ.. పెరూవియన్ మాక్సిమో నాపా కాస్ట్రో నిజ జీవితం. పెరూవియన్ తీరంలోని మార్కోనా పట్టణానికి చెందిన మాక్సిమో డిసెంబర్ 7న ఫిషింగ్ కోసం బయలుదేరాడు. రెండు వారాల ట్రిప్. అందుకు తగ్గట్టుగానే ఆహారాన్ని కూడా పఆయక్ చేసుకున్నాడు. పది రోజుల తరువాత వచ్చిన తుఫాను అతని పడవను దారి మళ్లించింది. పసిఫిక్ మహాసముద్రంలో కొట్టుకుపోయాడు. అతని కుటుంబం, పెరూ సముద్ర గస్తీ దళాలు వెదకడం మొదలెట్టాయి. మరోవైపు నట్ట నడి సముద్రంలో తప్పిపోయిన మాక్సిమోకు ఎటు చూసినా నీళ్లు. కుటుంబంపైనే ధ్యాస. తన తల్లి గురించి, నెలల వయసున్న మనవరాలి గురించిన ఆలోచనలే. అవే ఆయన జీవితంపై ఆశ.. ఎలాగైనా బతికి ఒడ్డుకు చేరాలన్న స్ఫూర్తిని ఇచ్చాయి. వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని తాగాడు. బతకడం కోసం కీటకాలు, పక్షులు, తాబేలును తిన్నాడు. ఎవరో ఒకరు కనిపెట్టేవరకూ తాను బతికుండాలన్న ఆశ అతని ప్రాణాలను నిటబెట్టింది. నాపా కాస్ట్రో కుటుంబం, మత్స్యకారుల బృందాలు మూడు నెలలుగా గాలిస్తూనే ఉన్నాయి. మూడు నెలలైనా ఆచూకీ దొరకలేదు. అయినా అటు కుటుంబం ఆశలు వదులు కోలేదు. "నాన్న నీవు రాకపోవడం మాకు అంతులేని బాధ. ఈ పరిస్థితిని ఎదుర్కొంటామని మేము ఎప్పుడూ అనుకోలేదు. మిమ్మల్ని కనుగొంటామనే ఆశ ఉంది'అని అతని కుమార్తె మార్చి 3న ఫేస్‌బుక్‌లో రాసింది. సరిగ్గా ఇది జరిగిన 8 రోజులకు మార్చి 11న ఈక్వడార్ గస్తీ బృందం ఫిషింగ్ బోటులో ఆయనను కనుగొన్నది తీరానికి 1,094 కి.మీ దూరంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మాక్సిమోను రక్షించింది. వెంటనే ఈక్వెడార్, పెరూ సరిహద్దుకు సమీపంలోని పైటాలోని న్యూస్ట్రా సెనోరా డి లాస్ మెర్సిడెస్ ఆసుపత్రికి తరలించింది. గత 15 రోజులుగా ఏమీ తినకుండా ఉండటంతో తీవ్ర డీహైడ్రేషన్‌కు గురయ్యారని వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం మాక్సిమో సోదరుడికి అప్పగించారు. తన తండ్రి ప్రాణాలను కాపాడిన కుమార్తె ఇనెస్ నాపా టొర్రెస్ కృతజ్ఞతలు తెలిపింది. 'ఈక్వెడార్ సోదరులారాా, నా తండ్రి గాటన్‌ను రక్షించినందుకు ధన్యవాదాలు, దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు'అని ఆమె ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

# అరబ్బుల ఇంటికి.. మన అరటి!

## టన్ను అరటి రూ.20 నుంచి 25 వేలతో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

## హర్షం వ్యక్తం చేస్తున్న అరటి రైతులు



పులివెందులరూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందుల అరటి కాసులు కురిపిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో మంచి డిమాండ్ ఉన్న ఈ అరటి ఇటీవల కాలంలో గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతూ నాణ్యత విషయంలో తగ్గేదే లేదంటోంది. ఈ ప్రాంతంలో సాగయ్యే అరటికి బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వస్తున్నారు. ఢిల్లీ మార్కెట్‌కు అనుకూలంగా ఉన్న తోటలను ఎంచుకుని అరటికాయలను కొనుగోలు చేస్తున్నారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ధరలు నిర్ణయించి కొనుగోలు చేయడం ద్వారా దళారుల బెడద లేకుండా పోయిందని రైతన్నలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నియోజకవర్గంలో 10 నుంచి 15వేల ఎకరాల్లో ...

పులివెందుల ననియోజకవర్గ వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో అరటి సాగు ఉంటే ఇందులో 10వేల ఎకరాల్లో గెలలు మొదటి కోతకు రానున్నాయి. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె మండలాల్లో అధికంగానూ, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో తక్కువగా అరటి సాగు అవుతోంది. ఒకసారి సాగు చేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా మే, జూన్, జూలై నెల్లో సాగుచేస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోతకు వచ్చేలా సాగు చేయడం ద్వారా ధరలు ఉంటాయని రైతులు అంటున్నారు.

### ఎకరాకు రూ.60వేలు పైనే పెట్టుబడులు

అరటి సాగులో పెట్టుబడులు కూడా అధికం అవుతున్నాయి. ఎకరా సాగు చేయాలంటే రూ.60వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అరటి నాటిన మొదలు గెలలు కోతకు వచ్చే వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాగుచేసిన 11 నెలలకు గెలలు కోతకు వస్తాయి. సాగులో పెట్టుబడులు అవుతున్నప్పటికీ ఆదాయం ఉంటుందనే రైతులు అరటిని సాగుచేస్తున్నారు. డ్రిప్పు ద్వారా నీటి తడులతో పాటు ఎరువులు అందించడం ద్వారా నాణ్యమైన అరటి ఉత్పత్తులు అందుతున్నాయి. సాగులో ఎకరాకు 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడులు వస్తున్నాయి. ఒక్కో గెల 10 నుంచి 12 చీప్‌లు వేస్తుందని రైతులు అంటున్నారు.

### వారం రోజుల పాటు అరటి కాయల నిల్వ ...

పులివెందుల నుంచి అరటిని ఢిల్లీకి తరలించాలంటే వారంరోజులు పడుతుంది. పక్వానికి వచ్చిన గెలలను కొట్టి చీపులను వేరుచేస్తారు. ఎలాంటి రసాయనాలు వాడుకుండా వారంపాటు నిల్వ ఉండడంతో ఢిల్లీకి చెందిన వ్యాపారులు పులివెందుల అరటి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కోసారి అరటి గెలలను లారీకి లోడ్ చేసి ఢిల్లీకి తరలిస్తారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లేసరికి అరటి గెలలు దెబ్బతినవని, కాయలు నాణ్యతగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

### అరటికాయలను శుద్ధిచేసి ప్యాకింగ్ ...

పులివెందుల నుంచి అరటి కాయలను ఢిల్లీకి తరలించాలంటే శుద్ధి చేసి ప్యాకింగ్ చేయాల్సి ఉంటుంది. దీంతో తోటల వద్దకు కూలీలు వెళ్లి అరటి గెలలు తీసుకువచ్చి చీపులను వేరుచేస్తారు. వీటిని బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిలో శుద్ధి చేస్తారు. అలా శుద్ధిచేసిన చీపులను అట్టపెట్టెలో కవరు వేసి అందులో అరటి కాయలను ఉంచి ప్యాకింగ్ చేస్తారు. ఒక్కో అట్టపెట్టెలో 15కిలోల చొప్పున అరటికాయలను ప్యాక్ చేస్తారు. తోటల వద్దనే తూకాలు వేసి అట్టపెట్టెలను సీజ్ చేస్తారు. అరటికాయలతో ఉన్న అరటి పెట్టెలను లోడ్ చేసి ఢిల్లీ మార్కెట్‌కు తరలిస్తారు.

### గల్ఫ్ దేశాలకు పులివెందుల అరటి

పులివెందుల ప్రాంతంలో పండిన అరటికి ఢిల్లీ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎక్కువగా ఈ సీజన్‌లోనే ఇక్కడ అరటి కాయలను తరలిస్తారు. నెలకు 10నుంచి 15వేల టన్నుల మేర కాయలు ఢిల్లీ మార్కెట్‌తో పాటు గల్ఫ్ దేశాలు అరబ్, ఇరాక్, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్తాయి. ఇక్కడ పండించిన అరటి నాణ్యతుగా ఉండడం, వారం రోజుల పాటు నిల్వ ఉండడం వల్ల ఢిల్లీ మార్కెట్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో డిమాండ్ ఉంటుంది. - రామమల్లేశ్వరరెడ్డి, అరటి రైతు

# బట్టమేక.. కష్టాల కేక

## కనుమరుగవుతున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షులు

### దేశవ్యాప్తంగా తగ్గిపోయిన సంఖ్య

### ప్రస్తుతం 150 మాత్రమే ఉన్నట్టు నిర్ధారణ

### నంద్యాల జిల్లా రోళ్లపాడు అభయారణ్యంలోనూ కనిపించని ఉనికి

### గడ్డి భూములు కుచించుకుపోవడంతో చెదిరిపోయిన ఆవాసాలు

### కృత్రిమ గర్భధారణ ద్వారా బట్టమేక సంతతి వృద్ధికి ప్రయత్నాలు

పొడవైన తెల్లటి మెడ.. దాని చుట్టూ తెలుపు-నలుపు ఈకల హారం.. బంగారు/గోధుమ వర్ణపు వీపు.. తలపై నల్లని టోపీతో ఇట్టే ఆకర్షించే రూపం బట్టమేక పక్షుల సొంతం. విమానం మాదిరిగా నేలపై పరుగులు తీసి గాల్లోకి లేచి.. స్థిమితంగా.. లయబద్ధంగా విశాలమైన రెక్కలు కదిలిస్తూ గగన విహారం చేయడం వీటి ప్రత్యేకత.

అమరావతి: అరుదైన బట్టమేక పక్షులు (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) మన దేశంలో అంతరించిపోయే స్థితికి చేరాయి. కొన్నేళ్లుగా చాలాచోట్ల వీటి జాడ కనిపించడం లేదు. 2008లో రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో 300 బట్టమేక పక్షులు ఉండగా.. ప్రస్తుతం వాటిసంఖ్య దేశవ్యాప్తంగా 150కి పడిపోయినట్టు తేలింది. వాటిలోనూ ఎక్కువ పక్షులు రాజస్థాన్‌లోనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 20కిపైగా బట్టమేక పక్షి జాతులు ఉండగా.. మన దేశంలో 4 జాతులున్నాయి. వాటిలో మన రాష్ట్రంలో కనిపించేవి ఇంకా అరుదైన జాతి పక్షులు.

### మీటరు పొడవు.. 15 కిలోలకు పైగా బరువు

బట్టమేక పక్షుల్లో అత్యంత బలిష్టమైనవి మన ప్రాంతంలోనే ఉండేవి. ఈ పక్షి మీటరు పొడవు, 15 నుండి 20 కిలోల బరువు, పొడవాటి మెడ కలిగి ఉంటుంది. వీటిసంతతి చాలా అరుదుగా వృద్ధి చెందుతూ కేవలం ఏడాదికి ఒక గుడ్డు మాత్రమే పెట్టి దట్టమైన పొదల్లో 27 రోజులపాటు పొదుగుతుంది. దీని జీవిత చక్రం సుమారు 12 ఏళ్లు. ఒక్కో ఆడ పక్షి జీవిత కాలంలో కేవలం ఐదారు గుడ్లు మాత్రమే పెడతాయి. ఏవి దొరికినా తిని కడుపు నింపుకోవడం వీటి ప్రత్యేకత. ధాన్యం గింజలు, పంటల కోత తర్వాత మిగిలిన మోళ్లు, వేళ్లు, పొలాల్లోని మిడతలు, పురుగులు, జెర్రులు, బల్లులు, తొండలు వంటివి వీటి ఆహారం. ఎగిరే పక్షుల్లో రెండవ అతి భారీ పక్షులుగా గుర్తింపు పొందినా.. నివాసానికి అనుకూల వాతావరణం లేక అంతరించిపోతున్నాయి.



### సంరక్షణ చర్యలున్నా.. ప్రయోజనం సున్నా

మన దేశంలో కనిపించే అత్యంత అరుదైన బట్టమేక పక్షి జాతుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నా ప్రయోజనం కలగడం లేదు. వీటికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రాల్లోనూ వాటి జాడ అరుదుగా మాత్రమే కనిపిస్తోంది. గత ఏడాది కర్ణాటకలోని బళ్లారి సమీపాన సిరిగుప్పలో రెండు, మహారాష్ట్ర లోని బీదర్‌లో ఒకటి కనిపించినట్టు అటవీ శాఖ నిర్ధారించింది. ఆ తర్వాత వీటి జాడ ఎక్కడా కానరాలేదు. మన రాష్ట్రంలోనూ వీటి కోసం నంద్యాల జిల్లా నందికొట్కూరు సమీపంలోని రోళ్లపాడులో 600 హెక్టార్లలో బట్టమేక పక్షుల అభయారణ్యాన్ని ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా అక్కడ కూడా ఈ పక్షులు కనిపించడంలేదు. వేటగాళ్ల ఉచ్చులకు బలైపోవడం, ఆవాసాలు తగ్గిపోవడం, ఎగిరే సమయంలో గాలి మరలు, విద్యుత్ లైన్లకు తగిలి మృత్యువాత పడటం, వాహనాల రణగొణ ధ్వనులే ఇవి అంతరించిపోవడానికి ప్రధాన కారణాలని వన్యప్రాణుల నిపుణులు చెబుతున్నారు.

### గడ్డి భూములు తగ్గిపోవడంతో..

పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో గడ్డి భూముల పాత్ర కీలకం. బట్టమేకల పక్షుల ఉనికి పర్యావరణానికి మేలు చేసే గడ్డి భూములపైనే ఆధారపడి ఉంది. విశాలమైన గడ్డి మైదానాలే వాటి ఆవాసాలు. అందుకే బట్ట మేక పక్షులను గడ్డి భూముల జీవనాడిగా చెబుతారు. ఈ భూములు పశువులకు మేత అందించడంతోపాటు పశువులపై ఆధారపడి జీవించే జాతుల మనుగడకు ప్రధానమైనవి. వాతావరణంలో ప్రాణవాయువును పెంచేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. తద్వారా పర్యావరణం, జీవ వైవిధ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తాయి. ఆయా ప్రాంతాల్లో నీటి ప్రవాహాన్ని గడ్డి భూములు క్రమబద్ధీకరిస్తాయి. అలాంటి గడ్డి భూములు తగ్గిపోతుండడం బట్టమేక పక్షులు అంతరించి పోతుండటానికి ప్రధాన కారణమైంది. మన దేశంలో 2005 నుంచి 35 శాతం మేర గడ్డి భూములు తగ్గిపోయినట్టు అంచనా. వ్యవసాయ విస్తరణ, పశువుల మేత ఎక్కువవడం, భూముల నిర్వహణ సరిగా లేకపోవడంతో జీవ వైవిధ్యం కోల్పోయి గడ్డి భూములు క్షీణిస్తున్నాయి. గతంలోని గడ్డి భూములు ప్రస్తుతం బంజరు భూములుగా మారిపోయాయి. ఫలితంగా ఆవాసాలు లేక బట్టమేక పక్షులు అంతరించిపోతున్నాయి.

### కృత్రిమ గర్భధారణపైనే ఆశలు

బట్టమేక పక్షుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ పక్షులను మళ్లీ పునరుద్ధరించే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వాటికోసం సురక్షితమైన గడ్డి మైదానాలను సృష్టించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచిస్తోంది. కృత్రిమ గర్భధారణ ద్వారా బట్టమేక పక్షి పిల్లలను పుట్టించి.. గడ్డి భూముల్లో వదలాలని నిపుణులు సూచిస్తున్నారు. రెండేళ్ల క్రితం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లోని జాతీయ పరిరక్షణ పెంపక కేంద్రం (నేషనల్ కన్జర్వేషన్ బ్రీడింగ్ సెంటర్) కృత్రిమ గర్భధారణ ద్వారా బట్టమేక పక్షుల్ని పునరుద్ధరించింది. వాటిని గడ్డి మైదానాల్లో వదిలి సంరక్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అవి ఎంతమేరకు సఫలీకృతం అవుతాయో వేచి చూడాలి.

## అసెంబ్లీలో వీగిపోయిన అన్నాడిఎంకె అవిశ్వాస తీర్మానం




చెన్నై : తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం.అప్పావుకి వ్యతిరేకంగా సోమవారం అన్నాడిఎంకె ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అన్నాడిఎంకె ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వాయిస్ ఓటుతో విఫలమైందని డిప్యూటీ స్పీకర్ పిచాండి ప్రకటించారు. 154 మంది సభ్యులు తీర్మానాన్ని వ్యతిరేకించగా, కేవలం 62 మంది మాత్రమే అనుకూలంగా ఓట్లు వేసినట్లు తెలిపారు. అసెంబ్లీలో స్పీకర్ ఎం. అప్పావు "పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, డిఎంకె కార్యకర్తలా పనిచేస్తున్నారు" అని అన్నాడిఎంకె తన తీర్మానంలో పేర్కొంది. అన్నాడిఎంకె ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని చూసి ప్రజలు 'నవ్వుతారు' అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎద్దేవా చేశారు. అప్పావు చర్యలు ఎల్లప్పుడూ నిష్పక్షపాతంగానే ఉన్నాయని, అందుకే స్పీకర్‌గా ప్రకటించామని అన్నారు. తమ ప్రభుత్వం, పార్టీ ప్రభావం లేకుండా ఆయన వ్యవహరిస్తున్నారని, ఈరోజు ఈ అంశాన్ని ప్రజలు కూడా విశ్వసిస్తారని అన్నారు.ద

## చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఆమోదం




చెన్నై : చంద్రుడిని అధ్యయనం చేయడానికి ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపిందని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ ఆదివారం తెలిపారు. బెంగళూరు ప్రధాన కార్యాలయం కలిగిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్‌గా నారాయణన్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణన్ మాట్లాడుతూ. 25 కిలోల బరువున్న రోవర్ 'ప్రజ్ఞాన్'ను మోసుకెళ్లిన చంద్రయాన్-3 మిషన్ మాదిరిగా కాకుండా, చంద్రయాన్-5 మిషన్ చంద్రుని ఉపరితలాన్ని అధ్యయనం చేయడానికి 250 కిలోల రోవర్‌ను మోసుకెళ్తుందని అన్నారు. 2008లో విజయవంతంగా ప్రయోగించబడిన చంద్రయాన్-1, చంద్రుని యొక్క రసాయన, ఖనిజ మరియు ఫోటో-జియోలాజిక్ మ్యాప్‌లను తయారు చేసింది. 2019లో చంద్రయాన్-2 మిషన్ చంద్రుని ఉపరితలంపైకి దూసుకెళ్లడంతో ముగిసింది. చంద్రయాన్-2 ఆర్బిటర్‌లోని హై-రిజల్యూషన్ కెమెరా వందలాది చిత్రాలను పంపిందని నారాయణన్ అన్నారు. చంద్రయాన్-3 మిషన్ చంద్రయాన్-2 కు కొనసాగింపుగా, చంద్రుని ఉపరితలంపై సురక్షితంగా ల్యాండింగ్, సంచరించడంలో ఎండ్-టు-ఎండ్ సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి ఉద్దేశించబడింది. ఇది ఆగస్టు 23, 2023న చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతంలో విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా సాఫ్ట్-ల్యాండ్ చేయగలిగింది. మూడు రోజుల క్రితం, చంద్రయాన్-5 మిషన్‌కు తమకు ఆమోదం లభించిందని, తాము జపాన్‌తో కలిసి దీనిపై పనిచేయనున్నట్లు నారాయణన్ తెలిపారు. చంద్రయాన్-4 మిషన్ 2027లో ప్రారంభించబడుతుందని భావిస్తున్నారు. చంద్రుని నుండి చంద్రుని నేల నమూనాలను సేకరించి, తదుపరి అధ్యయనం కోసం భూమికి తిరిగి తీసుకురావడం దీని లక్ష్యమని పేర్కొన్నారు. ఇస్రో భవిష్యత్ ప్రాజెక్టుల గురించి, గగన్‌యాన్‌తో సహా వివిధ మిషన్‌లతో పాటు, భారతదేశానికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ అని పిలువబడే స్వంత అంతరిక్ష కేంద్రాన్ని స్థాపించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని నారాయణన్ అన్నారు.

## డిజిటల్ అరెస్ట్ కుంభకోణాల్లో భారత్‌కు రెండు వేల కోట్ల నష్టం




న్యూఢిల్లీ : గత మూడు సంవత్సరాల కాలంలో దేశంలో డిజిటల్ అరెస్ట్ కుంభకోణాల సంఖ్య పెరిగిపోయింది. మోసగాళ్లు బాధితులకు ఆడియో లేదా వీడియో కాల్స్ చేసి తాము సిబిఐ, ఇడి, ఐటి అధికారులమని చెప్పి భయపెడుతూ వారి నుండి సొమ్మును దోచుకుంటున్నారు. 2022లో ఇలాంటి డిజిటల్ అరెస్ట్ కుంభకోణం కేసులు 39,925 నమోదయ్యాయని జాతీయ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) తెలిపింది. వాటి కారణంగా బాధితులు రూ.91 కోట్లు నష్టపోయారు. అయితే 2024 నాటికి కేసుల సంఖ్య గణనీయంగా పెరిగి 1,23,672కు చేరుకున్నాయి. అంటే 2022లో నమోదైన కేసులతో పోలిస్తే సుమారు మూడు రెట్లు అధికంగా కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఈ కేసుల కారణంగా బాధితులు రూ.1,935.5 కోట్లు 2022లో కంటే 20 రెట్లు అధికంగా నష్టపోయారు. ప్రస్తుత సంవత్సరం మొదటి రెండు నెలల్లోనే 17,718 కేసులు నమోదయ్యాయి. బాధితులు రూ.210.2 కోట్లు నష్టపోయారు. డిజిటల్ అరెస్ట్ సందర్భాల్లో బాధితులు సాధ్యమైనంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదు అందగానే వారు ఆ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేయిస్తారు. బదిలీ చేసిన సొమ్మును విత్‌డ్రా చేయకుండా బ్లాక్ చేస్తారు. ఆ తర్వాత ఆ ఖాతా ఎవరిది, ఫోన్ చేసిందెవరు అనే దానిపై ఆరా తీస్తారు. మోసగాళ్లు తమ డిజిటల్ ఫుట్‌ప్రింట్లను చెరిపేసేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు పలు కేసుల్లో వారిని గుర్తించి కటకటాల వెనక్కి నెట్టారు.

## కేదార్‌నాథ్ నుంచి హిందూ యేతరులను బహిష్కరించాలి

### బిజెపి ఎమ్మెల్యే ఆశా నౌతియాల్ వివాదాస్పద వ్యాఖ్యలు



డెహ్రాడూన్ : కేదార్‌నాథ్ ప్రాంతం నుంచి హిందూ యేతరులను బహిష్కరించాలంటూ ఉత్తరాఖండ్‌లోని బిజెపి ఎమ్మెల్యే ఆశా నౌతియాల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అక్కడ నివసిస్తున్న హిందూ యేతరులు మాంసం, మద్యం విక్రయిస్తూ స్థానికుల మనోభావాలను గాయపరిచే చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. ఇలా చేయడం హిందువుల మత విశ్వాసాలను దెబ్బతీయడమే అవుతుందని కేదార్‌నాథ్ శాసనసభ్యురాలైన నౌతియాల్ చెప్పారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 'నేను ఇక్కడి స్థానికులతో ఓ సమావేశాన్ని నిర్వహించాను. హిందూ యేతరులు మతపరమైన మనోభావాలను గాయపరుస్తున్నారని వారు చెప్పారు. ప్రపంచంలోని నలు మూలల నుండి భక్తులు ఇక్కడికి వచ్చి బాబా కేదార్‌ను ప్రార్థిస్తారు. కాబట్టి వారిని (హిందూ యేతరులు) అక్కడికి వెళ్లకుండా నిషేధించాలి. వారి చర్యలను స్థానిక వ్యాపారులు కూడా నిరసిస్తున్నారు' అని అన్నారు. కాగా నౌతియాల్ ప్రకటనపై కాంగ్రెస్ మండిపడింది. రాజకీయ లబ్ది కోసం ఒక ఎమ్మెల్యే ఇలా మాట్లాడడం దురదృష్టకరమని పిసిసి అధ్యక్షుడు కరణ్ మహారా వ్యాఖ్యానించారు. ఒకరి మతం ఆధారంగా తప్పు, ఒప్పును నిర్ణయించలేమని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని అనుసరించి ఎమ్మెల్యేగా ఆమె ప్రమాణం చేశారని గుర్తు చేశారు. మన దేశంలో చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పారు. అలాంటప్పుడు మైనారిటీలనే ఎందుకు లక్ష్యంగా చేసుకోవాలని ప్రశ్నించారు.

# త్రిభాషా వివాదం




విశ్వంలో ప్రతిదీ అద్భుతమే. మన పుట్టుక, పరిణామం, మెదడు, మాటతో సహా అన్నీ అద్భుతాలే. అద్భుతాల మధ్య జీవించడం అలవాటుగా మారి, వాటిని చటుక్కున గుర్తించం. అలాంటి అద్భుతాలలో మాట్లాడగలగడం ఒకటి. జీవపరిణామక్రమంలో, డెబ్బై వేల సంవత్సరాల క్రితం మనిషిలో మాట జన్యువు అభివృద్ధి చెంది, మాట్లాడడం నేర్చాడని శాస్త్రవేత్తలు అంటారు. మాటలన్నీ భాషగా మారి, ఆ భాష క్రమంగా అనేక భాషలుగా విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజున వేల సంఖ్యలో భాషలున్నాయి. ఒక్క మనదేశంలోనే భాషలు, యాసలు కలసి రెండువేలకు పైగా లెక్క కొచ్చాయి. వాటిలో లిపిలేనివీ ఉన్నాయి. తెలుగుతో సహా, కేవలం 22 భాషలనే రాజ్యాంగం గుర్తించింది. ఆ విధంగా భాషల మధ్య స్వాభావికంగానే ఆధిపత్యం, అసమానతలు ఉన్నాయన్నమాట. బ్రిటిష్ పాలనతో ఇంగ్లీషు వచ్చి చేరింది. స్వతంత్రులమయ్యాక దానిని పక్కన పెట్టి దేశీయ మైన ఒక భాషను జాతీయభాషగా చేసుకోవాలన్న ఆలోచన వచ్చి, హిందీ అందుకు అనువుగా కనిపించింది. ఇంగ్లీషును వెంటనే పక్కన పెట్టలేని స్థితిలో పాఠశాల, కళాశాలల స్థాయిలో ఇంగ్లీషు, మాతృభాష, హిందీ అనే త్రిభాషా సూత్రాన్ని కేంద్రం అమలులోకి తెచ్చింది. హిందీని వ్యతిరేకిస్తూ తమిళులు ఉద్యమించడంతో కేంద్రం మెట్టుదిగి ఇంగ్లీషు, తమిళం అనే ద్విభాషాసూత్రాన్ని వారు అమలు చేసుకోడానికి అవకాశమిచ్చింది. ఇప్పుడు మళ్ళీ కేంద్రం త్రిభాషా సూత్రం అమలు దిశగా వివిధ మార్గాలలో తమిళనాడుపై ఒత్తిడి తేవడం ప్రారంభించింది. అది చినికి చినికి పెద్ద రాజకీయ వివాదంగా పరిణమించడం చూస్తున్నాం. ఇదంతా విద్యాలయాల స్థాయిలో మూడు భాషలను నేర్పడం గురించి! నిజానికి భాష, లేదా భాషలు నేర్చుకోవడమనేది ఆసక్తీ, అభిరుచులతోనూబీ అంతకన్నా అత్యవసరంగా ఉపాధితోనూ, అందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాలకూ, విదేశాలకూ వెళ్లగలగడంతోనూ ముడిపడినది. జాతీయ సమైక్యత కోసమే అయినా అన్యభాషా బోధనను సిలబస్‌లో భాగం చేసినప్పుడు, అందులో విద్యార్థి ఆసక్తి, అభిరుచులకు బదులు నిర్బంధానిదే పై చేయి అవుతుందనీ, అలాంటి ఏ మొక్కు బడి భాషాభ్యసనమైనా విద్యార్థి దశతోనే ముగిసిపోయి నిరుపయోగమవుతుందనీ, చివరికి తమ అభిరుచికి తగిన, ఉపాధికి సాయపడే భాషకే పరిమితమవుతారనే అభిప్రాయాన్ని తోసి పుచ్చలేం. భాషలే కాదుబీ ఏది నేర్చుకోవడానికైనా ఆసక్తి, అవసరాలే కీలకాలు. భాషాప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడకముందు అధికసంఖ్యాక భాషాజనమూ, సరిహద్దుల్లోని అల్పసంఖ్యాక భాషా జనమూ కూడా మాతృభాషతోపాటు మరికొన్ని భాషలు మాట్లాడే అవకాశం ఉండేది. అది ఆ భాష లపై ఆసక్తికీ, వాటిలో ప్రావీణ్యానికీ దారితీయించి పలువురికి బహుభాషావేత్తలుగా గుర్తింపు నిచ్చింది. వెనకటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు తెలుగు, సంస్కృతాలతోపాటు హిందీ, కన్నడం, మరాఠీ, ఉర్దూ, పారశీక భాషల్లో అభినివేశమూ, రచన చేయగలిగిన పాండిత్యమూ ఉండేవి. భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు పదిహేడు దేశ, విదేశభాషలు తెలిసిన పండితుడిగా, రచయితగా ప్రఖ్యాతులు. ఆయన తెలుగు సాహిత్యం గురించి మాట్లాడినంత అనర్గళంగా, మరాఠీ, ఒరియా తదితర భాషా సాహిత్యాల గురించి కూడా మాట్లాడేవారు. వెనకటి పండితులలో వేలూరి శివరామశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు తదితరులు కూడా బహుభాషావేత్తలుగా ప్రసిద్ధులు. భారతీయభాషలే కాకబీ అనేక యూరోపియన్ భాషలు కూడా తెలిసిన పుట్టపర్తివారు గ్రీకు విషాదాంతనాటకాల నమూనాలో, సుయోధనుడు నాయకుడుగా, ఎలిజబెతెన్ ఆంగ్లంలో 'ది హీరో' అనే రచన చేశారు. విశ్వనాథవారి 'ఏకవీర'ను మలయాళంలోకి అనువదించి, కేరళ ప్రభుత్వ ఆహ్వానంపై మలయాళ పద వ్యుత్పత్తి నిఘంటు సంపాదక వర్గంలో సభ్యులుగా చేరారు. వీరందరినీ బహుభాషావేత్తలను చేసింది అభిరుచి, ఆసక్తులే తప్ప ఇతరేతర నిర్బంధాలు కావు. అవసరమూ, ఆసక్తీ బహుభాషానైపుణ్యాలవైపు నడిపించిన ప్రముఖులలో 19వ శతాబ్దికి చెందిన హైన్రిశ్ ష్లీమన్ ఒకడు. అంతర్జాతీయ వ్యాపారవేత్తే కాకబీ ట్రాయ్, మైసీనియాలలో తవ్వ కాలు జరిపి, తొలితరం పురాతత్వవేత్తలలో ఒకడుగా పేరొందిన ష్లీమన్ -తన మాతృభాష జర్మన్‌కు అదనంగా, గ్రీకు సహా అనేక యూరోపియన్ భాషలను నేర్చుకున్న తీరూ, చూపిన పట్టుదలా స్ఫూర్తిదాయకాలు. రైల్లో ప్రయాణిస్తున్నా, నడుస్తున్నా, ఏ పని చేస్తున్నా అతని పరభాషాభ్యాసం సమాంతరంగా సాగేదిబీ తనున్న లాడ్జిలో, ఆ భాషకు చెందిన శ్రోతకు డబ్బిచ్చి మరీ ఎదురుగా ఉంచుకుని ఆ భాషలో ఉపన్యసించేవాడుబీ అది ఇతరులకు నిద్రాభంగం కలిగించేది కనుక అతను లాడ్జీలు మారవలసివచ్చేది. ప్రేమకు భాషాభేదాలు లేకపోయినా, ప్రేమికుల మధ్య సంభాషణకు భాష తప్పనిసరి. ఆ ఇతి వృత్తంతో జైలు గువో అనే రచయిత్రి చైనీస్-ఇంగ్లీష్ నిఘంటువు పేరుతో ప్రేమికుల కోసం నవల రాసింది. అందులో చ్వాంగ్ అనే చైనా అమ్మాయి లండన్ వెళ్ళి ఓ బ్రిటిష్ యువకుడితో ప్రేమలో పడుతుంది. రోజూ కొన్ని ఇంగ్లీష్ మాటలను, వాటి అర్థాలను డైరీలో రాసుకుంటూ, ప్రియుడితో సంభాషించే మేరకు క్రమంగా ఆ భాషలో నేర్పు సాధిస్తుంది. కనుక, పరభాషాభ్యసనానికి అవసరమూ, ఆసక్తీ తోడ్పడినంతగా నిర్బంధం తోడ్పడదు. దేశీయమైన ఒక ఉమ్మడి భాషను నేర్చుకోవడానికి ఇతరేతర మార్గాలు చూడాలిబీ అందులోనూ భాషా ప్రజాస్వామ్యానికి పెద్దపీట వేయాలి.


## క్రూ-10 మిషన్‌తో ఐఎస్ఎస్ అనుసంధానం విజయవంతం

### నలుగురు వ్యోమగాములకు సునీత, విల్మోర్‌లు స్వాగతం



వాషింగ్టన్: సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బచ్ విల్మోర్ స్థానంలో వెళ్లిన నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. అక్కడ సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌తో ఆన్ మెక్‌క్లెయిన్, నికోల్ అయర్స్, టకుయా ఒనిషి, కిరిల్ పెస్కోవ్‌లు కలిశారు. సునీత, విల్మోర్‌లు వారందరికీ స్వాగతం పలికారు. దీనికి సంబంధించిన వీడియోను నాసా విడుదల చేసింది. సునీత, బుచ్ విల్మోర్‌ను తిరిగి తీసుకురావడానికి నాసా- స్పేస్‌ఎక్స్‌లు ప్రయోగించిన క్రూ-10 మిషన్ ఆదివారం ఉదయం ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉండిపోయిన భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్‌ని తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న విషయం తెలిసిందే. సునీతతో పాటు మరో వ్యోమగామి బచ్ విల్మోర్ త్వరలోనే తిరిగి భూమ్మీద అడుగుపెట్టనున్నారు. వీరిని తీసుకొచ్చేందుకు నలుగురు వ్యోమగాములతో కూడిన ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. నాసా-స్పేస్‌ఎక్స్ చేపట్టిన 'క్రూ-10' మిషన్‌లో భాగంగా భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారు జామున 4.33 గంటలకు కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి ఎగిరింది. రాకెట్‌కు అమర్చిన అంతరిక్ష నౌక ఐఎస్ఎస్ లోని ఎయిర్‌లాక్‌కు అనుసంధానం చేస్తారు. ఒకసారి ఎయిర్‌లాక్‌లో డాక్ అయితే లోపల ఉన్న వాతావరణం బయటకు రాదు. దీని తర్వాత అన్ని భద్రతా తనిఖీలను పూర్తి చేసిన తర్వాత, వ్యోమగాముల కోసం అంతరిక్ష నౌక తలుపులు తెరుచుకుంటాయి.ఽఈ సమయంలో వ్యోమగాములు తమ స్పేస్ సూటల్‌ను ధరించి అంతరిక్ష నౌక లోపలికి వెళ్తారు. డాక్ చేసిన అంతరిక్ష నౌకను ఐఎస్ఎస్ నుంచి వేరు చేసి, థ్రస్టర్‌లు (చిన్న జెట్ ఇంజన్లు) ఉపయోగించి నియంత్రించి, దాని నిర్దేశిత గమ్యంలోకి ప్రవేశపెడతారు. ఇలా వ్యోమగాములు భూమిపై నుంచి అంతరిక్షంలోకి వెళ్లిన అంతరిక్ష నౌకలోకి ప్రవేశిస్తారు. ఇక్కడి నుంచి వ్యోమగాములు తిరిగి భూమిపైకి చేరుకునే ప్రక్రియ మొదలవుతుంది. అంతరిక్ష నౌక భూమికి తిరిగి రావడానికి సుదీర్ఘ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. ఇందుకోసం అంతరిక్ష నౌకను సరైన పథంలోకి తీసుకువచ్చి నెమ్మదిగా భూమి వాతావరణంలోకి తీసుకువస్తారు. వాతావరణంలోకి ప్రవేశించేటప్పుడు ఉత్పన్నమయ్యే వేడి, మంటల నుంచి అంతరిక్ష నౌకను, ప్రయాణీకులను రక్షించడానికి అంతరిక్ష నౌక ముందు భాగంలో అధిక నాణ్యత గల ఉష్ణ కవచాలను అమర్చుతారు. ఇవి అగ్నిమాపక యంత్రాలతో పాటు లోపల ఉన్న పరికరాలను, ప్రయాణీకులను చల్లగా ఉంచుతాయి, తీవ్రమైన వేడి నుంచి వారిని రక్షిస్తాయి. అంతరిక్ష నౌక సరైన ఎత్తు, వేగాన్ని చేరుకున్నప్పుడు, అంతరిక్ష నౌకకు అటాచ్ చేసిన పారాచూట్ తెరుచుకుంటుంది. ఈ పారాచూట్లు అంతరిక్ష నౌకను సేఫ్ ల్యాండింగ్‌కు సహాయపడుతాయి. ప్రయాణీకులను తిరిగి తీసుకువచ్చే అంతరిక్ష నౌకలు ఎక్కువ శాతం నీటిలో ల్యాండ్ అవుతాయి. ఇందుకోసం మహా సముద్రాలను ఎంచుకుంటారు. సముద్రంలో ల్యాండ్ కాగానే రికవరీ బందం వారి వద్దకు వస్తుంది. రికవరీ బందం వారిని వైద్య కేంద్రానికి తీసుకెళుతుంది, అక్కడ వారి ఆరోగ్య పరిస్థితులను చెక్ చేస్తారు. అనంతరం వారిని విడిగా ఉన్న ప్రత్యేక గదిలో ఉంచుతారు. కొన్ని వారాల తర్వాత వారిని భూమి గురుత్వాకర్షణ శక్తికి తిరిగి అలవాటు చేసి, ఆ తర్వాత బయటకు పంపిస్తారు.

# లాజిక్ మిస్సయ్యారు!



నిరంకుశత్వంలోంచి, విద్వేష రాజకీయాల్లోంచి ఏ కళలు, ఏ సృజనా మొలకెత్తవు. కళలు, సంస్కృతి, సాహిత్యం వంటివి మానవత్వానికి ప్రతీకలు. ఈ మానవత్వాన్ని దెబ్బతీసేది, వేరుపురుగులా తొలిచేది విద్వేష రాజకీయం. సృజనాత్మకత, కళాతృష్ణ మానవత్వ భావాల్లోనుంచి మాత్రమే వెల్లివిరుస్తాయి. .'నూరు పూవ్వులు వికసించనీ వేయి భావాలు సంఘర్షించనీ' అంటారు మావో. సృజన అనేది బహుముఖం. కళ సృజనాత్మకమైనది రాగద్వేషాలకు అతీతమైనది. శాస్త్ర పరిశోధనలు సైతం సృజనాత్మకత నుంచి, భావ స్వేచ్ఛ నుంచి పుట్టుకొస్తాయే తప్ప విద్వేషం నుంచి కాదన్నది జగమెరిగిన సత్యం. . ప్రపంచంలో ఏ భాషవారైనా, ఏ ప్రాంతం వారైనా ప్రేమాభిమానాలు చవిచూసేది మొట్టమొదట తల్లి నుంచే. మొదటి మాట నేర్చుకునేదీ తల్లిభాష నుంచే. 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా/ పొగడరా నీ తల్లి భూమి భారతిని/ నిలుపరా నీ జాతి నిండు గౌరవము' అంటారు రాయప్రోలు. 'జల్దుకొని కళలెల్ల నేర్చుకు, దేశి సరుకులు నింపవోరు' అన్న గురజాడ ప్రబోధంలో కూడా మనకి ఏ హద్దులూ విధించలేదు. ఎవరి మాతృభాష వారు మాట్లాడాలి, ఎవరికి నచ్చిన భాష వారు నేర్చుకోవాలి. ఈ నేర్చుకోవడంలో, మాట్లాడటంలో వుండాల్సింది స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం. 1950ల నాటి ఫ్రెంచ్ సామ్రాజ్య పాలనకు వ్యతిరేకంగా జరిగిన అల్జీరియన్ తిరుగుబాటు యొక్క అసాధారణ పునఃసృష్టి 'ద బ్యాటిల్ ఆఫ్ అల్జీర్స్'. 1966లో వచ్చిన అల్జీర్స్ యుద్ధం అనే ఈ క్లాసిక్ చిత్రంలో ముస్లింల అణచివేత, తిరుగుబాటు వంటి అత్యంత ఉత్తేజభరితమైన సన్నివేశాలు అనేకం వుంటాయి. ఇలాంటి క్లాసిక్ చిత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఆస్వాదించగలుగుతున్నాం కదా? రాక్ మ్యూజిక్ నుంచి హిందూస్తానీ, జానపద సంగీతం వరకూ అన్నిరకాల సంగీతాలకూ మైమరచిపోతుంటాం. మలయాళం, తమిళం, బెంగాలీ, మరాఠీ వంటి ప్రాంతీయ భాషల్లో గొప్పగొప్ప క్లాసిక్ మూవీస్ వున్నాయి. వాటన్నింటినీ ఆస్వాదిస్తున్నాం కదా? కళాకారుడిగా వచ్చిన గుర్తింపుతో రాజకీయాల్లోకి వచ్చిన ఏపి డిప్యూటీ ముఖ్యమంత్రి భాషకీ భాషకీ మధ్య పోటీ పెట్టే రాజకీయాలు మాట్లాడటం శోచనీయం. ఈ తరహా రాజకీయం మొదలు పెట్టిందే కేంద్ర బిజెపి ప్రభుత్వం. దేశం మొత్తానికి ఒకే విద్యావిధానం వుండాలని హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేసింది. కాదంటే కేంద్రం నుండి రాష్ట్రానికి ఇవ్వవలసిన నిధులను ఇచ్చేది లేదని బెదిరిస్తోంది. ఇది ఆయా భాషలకు చెందిన ప్రజల స్వేచ్ఛను, రాజ్యాంగబద్ధమైన హక్కును కాలరాయడమే. దాదాపు నాలుగు కోట్ల జనాభా వున్న ఫ్రెంచ్ వారు, మూడు కోట్ల వరకూ వున్న జపనీస్ తమ తమ సొంతభాషలనే అన్ని వ్యవహారాలకూ వాడతారు. పలు ఆసియా, లాటిన్ అమెరికా దేశాలూ అంతే. సాహిత్యం, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలుఅన్నీ వారి వారి మాతృభాషలోనే రూపొందించుకున్నారు. ఇది వారి అస్తిత్వానికి సంకేతం. ఏ భాషనీ ఎవరిపైనా బలవంతంగా రుద్దకూడదు. ఇప్పుడు తమిళులు చేస్తున్న పోరాటం ఇదే. తమ అస్తిత్వం కోసం, తమ మాతృభాష కోసం పోరాటం చేస్తుంటే, రెండు భాషల మధ్య తగువుగా దీన్ని చిత్రించే ప్రయత్నం జరుగుతోంది. కాబట్టి తమిళులనో, తమిళ సినిమాలనో తప్పుబట్టడంలో విజ్ఞతలేదు. నిజానికి వారితో గొంతు కలిపి మన మాతృభాషను కాపాడుకునే ప్రయత్నం మనం చేయకుండా ఆ పని చేస్తున్నవారిపై బిజెపి భావజాలాన్ని మీ గొంతు నుంచి వెదజల్లడం ఎంతవరకూ భావ్యం? రాష్ట్రంలో బోధనా భాషగా వున్న తెలుగును ఎల్‌కేజీ నుంచే ఎత్తేసే ప్రయత్నానికి మద్దతిస్తున్న మీరు వారి హక్కునెలా ప్రశ్నిస్తారు? 'మీ హిందీ భాషను మా మీద రుద్దకండీ' అని చెప్పడం ఇంకో భాషను ద్వేషించడం కాదు. నా తల్లిని నేను గౌరవిస్తాను అంటే, ఎదుటివారి తల్లిని అవమానిస్తున్నట్లు కాదన్న చిన్న లాజిక్‌ను ఎందుకు మిస్సవుతున్నారు? తమిళులను తప్పుబట్టకుండా, మీరూ మీ తల్లిభాషను వారిలా ప్రేమించడం మొదలుపెడితే ఎక్కడ గాడితప్పామో మనకర్థమౌతుంది. పదికోట్ల తెలుగువాళ్లు ఒక జాతిగా ముందడుగేయడానికి ప్రేరణ ఇవ్వగల మాతృభాషను విస్మరించి, ఆత్మగౌరవాన్ని, మరిచి, ఎవరెవరి సేవలోనో తరించిపోవడం సిగ్గుచేటు. అదిచాలదన్నట్లు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి నిలబడి పోరాడుతున్న సాటి రాష్ట్రం మీద విమర్శలకు దిగడం అంతకన్నా హేయం.